అమరావతి
శనివారం
12-1-2019
సంపుటి: 3, సంచిక: 35
పేజీలు: 8+8, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM



డేరా బాబా దోషి

జర్నలిస్టు హత్య కేసులో కోర్టు తీర్పు

మరో ఇద్దరు కూడా దోషులే..

అత్యాచారం కేసులో ఇప్పటికే జైలులో గుర్మీత్

7

మా ఇష్టం

ఎవరు వద్దన్నా ఆగని పందెంరాయుళ్లు

- అనుమతి లేదన్న పోలీసులు.. అయినా జోరుగా ఏర్పాట్లు
- పలు జిల్లాల్లో బరులు సిద్ధం.. టెంట్ల దగ్గరే సకల సౌకర్యాలు
- సమీపంలోనే బెల్టుషాపులు.. గోదావరి జిల్లాల్లో భారీజూదం
- రాజకీయ నేతల కనుసన్నల్లో పందేలు.. కోట్లలోనే టర్నోవర్
- తెలంగాణ నుంచి అభిమానులు.. జూలు విదిలిస్తున్న పుంజులు
- కొన్నిచోట్ల బరులు తొలగిస్తున్న పోలీసులు.. వారిపై ఒత్తిడులు





(మనం న్యూస్ నెట్‌వర్క్)

ఒకవైపు కోడిపందేలు వేస్తే ఎక్కడా ఊరుకునేది లేదని.. జూదాన్ని అనుమతించేది లేదని పోలీసులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. కానీ కోడిపందేలు వేసే పందెంరాయుళ్లు మాత్రం అస్సలు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేస్తున్నారు. మా ఇష్టం.. మేం వేస్తామంటూ పందెంబరులను సిద్ధం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సీజన్ సందర్భంగా భారీ స్థాయిలో పందేలు వేయడానికి సన్నద్ధమైపోయారు. బరులు గీయొద్దని, పందేలు వేయొద్దని ఎన్ని ఆంక్షలున్నా.. వాటిని ఎవరూ పట్టించుకోవటం లేదు. ప్రతిసారి లాగానే ఈ సంవత్సరం కూడా అన్ని ప్రాంతాలలో బెట్టింగ్‌లు, కోడిపందేల నిర్వహణకు భారీస్థాయిలో బరులను ఏర్పాటు చేసేశారు. పండుగ మూడురోజులూ ఎలాంటి ఆటంకాలు లేకుండా పేకాట శిబిరాలు, కోడి పందేలు నిర్వహించుకునేందుకు పోలీసులకు భారీ స్థాయిలో ముట్టజెబుతున్నారు. పోలీసులు కూడా పైకి ఇవేమీ వద్దని అంటున్నా.. లోలోపల మాత్రం ప్రత్యేక అనుమతుల పేరిట అనధికారికంగా పచ్చజెండా ఊపేసినట్లు తెలుస్తోంది. ఉభయ గోదావరి ..మిగతా 2లో



పండుగ మోత

రైల్వే ప్లాట్‌ఫాం టికెట్ల ధర పెంపు

- 11 నుంచి 20వ తేదీ వరకు వర్తింపు
- విజయవాడ.. రాజమండ్రి.. నెల్లూరు
- 3 స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ రూ. 20
- సంక్రాంతికి దక్షిణమధ్య రైల్వే నిర్ణయం

విజయవాడ, జనవరి 11:

సంక్రాంతి పండుగ సీజన్ కావడంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్యరైల్వే ప్లాట్‌ఫాం టికెట్ ధరలను పెంచింది. రద్దీ ఎక్కువగా ఉండే కొన్ని స్టేషన్లలో మాత్రం పది రోజుల పాటు ఈ పెంపు వర్తిస్తుందని ఓ ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా విజయవాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు రైల్వే స్టేషన్లలో ప్రయాణాలు చేయకుండా కేవలం తమవారిని తీసుకెళ్లడానికి లేదా దించేందుకు వచ్చేవారు తీసుకునే ప్లాట్‌ఫాం టికెట్ ధరలను రెట్టింపు చేసింది. సంక్రాంతి పండుగ సీజన్ సందర్భంగా రైలు ప్రయాణికులు భారీ సంఖ్యలో ఉండే అవకాశం ఉందని, వారితోపాటు ప్రయాణాలు చేయకపోయినా వారికి సాయంగా స్టేషన్లకు వచ్చేవారు.. లేదా వివిధ ప్రాంతాల నుంచి రైళ్లు వచ్చినపుడు తమవారిని రిసీవ్ చేసుకోడానికి వచ్చేవారితో రైల్వేస్టేషన్ ప్రాంగణం బాగా రద్దీగా మారే అవకాశం ఉన్నందున.. ప్లాట్‌ఫాం టికెట్ల ధరను రూ. 10 నుంచి 20కి పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. రైలు ప్రయాణికులు, ఇతరులు ఈ పెంపును గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరింది.

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం; తిథి: శుక్లపక్షం, షష్ఠి సా.5.36 వరకు; తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర పూర్తి(24గంటలు); వర్జ్యం: ప.3.43 నుంచి 5.27 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.36 నుంచి 8.04 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు; అమృతఘడియలు: రా.2.09 నుంచి 3.44 వరకు;

వాతావరణం




ఆంధ్రప్రదేశ్‌లో శనివారం వాతావరణం మబ్బులతో కూడి చల్లగా ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురవచ్చు.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 27 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 67 శాతం

గాలి వేగం: గంటకు 16 కి.మీ.



ఐకానిక్ బ్రిడ్జి

నేడే సీఎంచే శంకుస్థాపన

1300 కోట్లతో నిర్మాణం

ఏడాదిలోగా పనులు పూర్తి

మంత్రి ఉమామహేశ్వరరావు

వివరాలు 3లో

వర్మ రాజీనామా

అగ్నిమాపక శాఖ డీజీగా నియామకం

- అవమానభారంతో తప్పుకొన్న అలోక్
- ఈనెల 29న అలోక్‌వర్మ పదవీవిరమణ
- ఈలోపే ఉద్యోగం వదులుకున్న అధికారి
- మళ్లీ సీబీఐ డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు
- అలోక్ వర్మ తీసుకున్న నిర్ణయాలు రద్దు
- రాకేశ్ ఆస్థానా అరెస్టుకు హైకోర్టు ఆదేశం
- 10 వారాల్లోగా విచారణ: సీబీఐకి సూచన



న్యూఢిల్లీ, జనవరి 11:

సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి ఉద్వాసనకు గురై.. అగ్నిమాపక శాఖ ప్రధానాధికారిగా బదిలీ అయిన అలోక్ వర్మ.. ఆ బాధ్యతలు స్వీకరించేందుకు నిరాకరించి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయాల్సి ఉన్న అలోక్ వర్మ.. ఈలోపు జరిగిన పరిణామాలలో సుప్రీంకోర్టులోనూ ఊరట లభించినట్లే లభించి 48 గంటల్లోనే తన పదవిని పోగొట్టుకోవాల్సి రావడంతో అవమానభారంతో తన ఉద్యోగాన్ని వదులుకున్నారు. సీబీఐ చీఫ్ పదవి నుంచి తప్పించిన తర్వాత అలోక్ వర్మను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేశారు. ఆయన ఆశించినంత న్యాయవర్తన చూపించలేదని, అందువల్లే ఆయనను బదిలీ చేయాల్సి వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని హైపవర్ కమిటీ తెలిపింది. అలోక్ వర్మ జనవరి 29వ తేదీన పదవీ విరమణ చేయాల్సి ఉంది. సహజ న్యాయం కుంటుపడిందని, సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తనను తప్పించే క్రమంలో మొత్తం వ్యవస్థ అంతా తలకిందులైందని ఈ సందర్భంగా అలోక్ వర్మ తాను విడుదల చేసిన ఓ ప్రకటనలో అన్నారు. సుప్రీంకోర్టు తనను సీబీఐ చీఫ్ పదవిలో నియమించిన రెండు రోజుల్లోనే వర్మ ఆ పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

గత సంవత్సరం అక్టోబరు నెలలో అర్ధరాత్రి సమయంలో ఆయనను బలవంతంగా సెలవు మీద పంపారు. ఆయన బృందంలో ఉన్న అధికారులలో పలువురిని ఆ తర్వాత తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం. నాగేశ్వరరావు బదిలీ చేశారు. తనను బలవంతపు సెలవుపై పంపడాన్ని ..మిగతా 2లో

ఇదీలోకం!



ఉన్నదంతా టికెట్లకే సరిపోయిందిగా..
వీపు విమానం మోత మోగింది..!

అత్తా అల్లుళ్ల పొత్తు!

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ కూటమి

- నేడు ప్రకటించేందుకు అవకాశం
- సంయుక్త మీడియా సమావేశం
- కాంగ్రెస్‌తో ఇద్దరికీ కుదరని పొత్తు
- ఉప ఎన్నికల ఫలితాలతో ఉత్సాహం



లఖ్‌నవూ, జనవరి 11:

ఉత్తరప్రదేశ్‌లోని అత్తా అల్లుళ్ల (భువా-భతీజా) మాయావతి, అఖిలేశ్ యాదవ్ కలిసి పోటీ చేయడం దాదాపు ఖరారైపోయింది. ఒకప్పటి ఆగర్భ శత్రువులైన బహుజన సమాజ్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవాలన్న నిర్ణయం ఇంచుమించు ఖాయమైంది. అదే విషయాన్ని ప్రకటించేందుకు శనివారం ఇద్దరూ కలిసి యూపీ రాజధాని లఖ్‌నవూలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో సంయుక్త విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయంలో దీన్ని ఏర్పాటుచేయడంతో అక్కడే భారీ విందు కూడా ఉండబోతోందని తెలుస్తోంది. ఇదంతా చూస్తుంటే.. రెండు పార్టీల మధ్య సీట్ల పంపిణీ విషయంలో కూడా ఒక అవగాహన వచ్చేసిందని, కేవలం దాన్ని అధికారికంగా ప్రకటించడం ఒక్కటే మిగిలి ఉందని ..మిగతా 2లో



వృద్ధుల పింఛన్ 2 వేలు

వితంతువులకు కూడా వర్తింపు

- జనవరి నుంచే అమలులోకి..
- ఫిబ్రవరిలో ఒకేసారి చెల్లింపు
- చంద్రబాబు సంక్రాంతి కానుక
- 54 లక్షల మంది ప్రయోజనం

మనం న్యూస్, నెల్లూరు, జనవరి11:

సీఎం చంద్రబాబు నాయుడు పింఛనుదారులకు సంక్రాంతి కానుక అందించారు. నెలనెలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు ఇస్తున్న పింఛను సొమ్ము రెట్టింపు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రజలకు ..మిగతా 2లో

అద్భుత ప్రగతి సాధించాం..

- ఇదే నిజమైన సంక్రాంతి
- జన్మభూమి ముగింపులో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 11: రాష్ట్రంలో అద్భుత ప్రగతి సాధించామని, ఇదే నిజమైన సంక్రాంతి అని, దీన్ని 'రాష్ట్ర అభివృద్ధి సంక్రాంతి'గా సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. జన్మభూమి చివరి రోజు జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సీఎం టెలికాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

నాకు అసూయ ఎక్కువ! చంద్రబాబు

''అద్భుత ప్రగతి సాధించాం. యావత్ ప్రపంచం మన దిక్కు చూస్తోంది. ఇది నిజమైన సంక్రాంతి. ఇది రాష్ట్ర అభివృద్ధి సంక్రాంతి, పేదల సంక్షేమ సంక్రాంతి.. ఇంత పెద్ద పండుగ ప్రజలకు చేరువ చేశారు.. పాలనా యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకు అభినందనలు. 40ఏళ్లలో ఎప్పుడూ లేనంత ఆనందం, సంతృప్తి ఉంది. నిర్మాణంలో వచ్చినంత ఆనందం దేనిలోనూ రాదు. విభజన సమయంలో ఏపీ బృందాన్ని బలహీన బృందమన్నారు. ఇప్పుడు ఆ బృందంతోనే అద్భుతాలు సృష్టించాం. నాలుగేళ్లలో 670 అవార్డులే మన కృషికి రుజువు. 16వేల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం ఒక చరిత్ర. 16వేల గ్రామాల అభివృద్ధి, ప్రణాళికలను అప్‌లోడ్ చేయడం రికార్డు. పోలవరం కాంక్రీట్ పనుల్లో గిన్నెస్ రికార్డు సాధించాం. మనకంటే ఇతర రాష్ట్రాలు ముందుకు పోతే నాకు అసూయ. ఆ అసూయనే కసిగా మార్చుకుంటా. 7 మిషన్లు, 5గ్రిడ్‌లు, 5ఉద్యమాలతో మన ప్రయాణం ప్రారంభమైంది'' అంటూ సీఎం ప్రసంగం సాగింది.

కేంద్రానివి 'డర్టీ పాలిటిక్స్'..

- ప్రధానికి ఇంగ్లీష్ కూడా రాదు
- టెలి ప్రాంప్టర్‌లో చూసి చదువుతారు..
- 'ఆయుష్మాన్ భారత్' మాకొద్దు.. దీదీ

న్యూఢిల్లీ, జనవరి 11: బోలెడు ప్రసంగాలు చేసే మోదీకి ఇంగ్లీష్ ఏమాత్రం రాదని దీదీ విమర్శించారు. ''ఆయన కనుపాపలు టెలిప్రాంప్టర్ మాత్రమే చూస్తాయి.. అప్పుడు మాత్రమే ఆయన ఇంగ్లీష్‌లో మాట్లాడగలరు. మీడియాకు ఈ విషయం బాగా తెలుసు. మిగతావారికి కూడా తెలుసు, తాను చెప్పాలనుకున్నది ఆయన చదువుతారంతే. కాకపోతే పైకి మాత్రం తానేదో ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడగలరు అన్నట్టు చదివేస్తారు. మనకు ఇవన్నీ చేయాల్సిన అవసరం లేదు'' అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం తమకు వద్దేవద్దంటూ ప్రకటన చేసిన ఆమె, ప్రధాని ఇంగ్లీష్‌పై కామెంట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. మోదీని ఘాటుగా విమర్శించే వారిలో ముందువరుసలో ఉండే దీదీ తాజా వ్యాఖ్యలు బీజేపీ గొంతులో పచ్చివెలక్కాయ వేసినట్టైంది. కేంద్రానివి అన్నీ 'డర్టీ పాలిటిక్స్' అంటూ ఆమె విరుచుకుపడ్డారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో ప్రధాని రాజకీయాలు చేస్తున్నారని, ఇందులో భాగంగా రాష్ట్రంలో గడపగడపకూ లేఖలు, తన ఫొటోతో పాటు పార్టీ గుర్తైన కమలంను పంపుతున్నారని ఆరోపించారు. కేంద్ర పథకంగా చెప్పుకుంటున్న ఇందులో రాష్ట్రాలు 40శాతం భరించాలని, తాను ఇందుకు సిద్ధంగా లేనంటూ ఆమె కుండబద్ధలుకొట్టారు. ఈ పథకం మొత్తం బాధ్యత ఎన్డీఏదే అని ఆమె చెప్పుకొచ్చారు. ఈ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు భరించాల్సి ఉంటుంది.

దక్షిణ చైనా సముద్రంలో 'వార్'

- ఆధిపత్యం కోసం అమెరికా, చైనా పోటాపోటీ

బీజింగ్, జనవరి 11: దక్షిణ చైనా సముద్రం ఇప్పుడు ఉద్రిక్త ప్రాంతంగా మారింది. ప్రస్తుతం అక్కడి జలాల్లో అమెరికాకు చెందిన మెక్ క్యాంప్‌బెల్ క్షిపణి విధ్వంసక నౌక పహారా కాస్తోంది. జీషా దీవుల్లో ఆ నౌక సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా నౌక సంచారంతో.. చైనా అప్రమత్తమైంది. తమ దగ్గర ఉన్న ఇంటర్మీడియట్ రేంజ్ అణు సామర్థ్యం కలిగిన డీఎఫ్-26 క్షిపణి విధ్వంసక నౌకను మోహరిస్తోంది. ఫ్రీడమ్ ఆఫ్ నావిగేషన్ అన్న సంకేతంతో తమ నౌక సంచరిస్తున్నట్లు అమెరికా వెల్లడిస్తోంది. కానీ అమెరికా వాదనలను చైనా కొట్టిపారేస్తోంది. తమ జలాల్లోకి అమెరికా నౌకలు అక్రమంగా ప్రవేశిస్తున్నట్లు చైనా ఆరోపిస్తున్నది. డీఎఫ్-26 షిప్ కిల్లర్ మిస్సైళ్లు సుమారు 5 వేల కిలోమీటర్ల వరకు ప్రయాణించగలవు. ఈ క్షిపణులు అణ్వాయుధాలను కూడా మోసుకెళ్లగలవు. అమెరికా పశ్చిమ తీర ప్రాంతమైన గువామ్ వరకు కూడా ఆ మిస్సైళ్లు వెళ్లగలవు. డీఎఫ్-26 నుంచి వదిలిన మిస్సైళ్లు మొదట్లో తక్కువ స్థాయిలో ప్రయాణిస్తాయని, అప్పుడు వాటిని రేడార్లతో పసికట్టవచ్చు అని, కానీ దూరం వెళ్లిన తర్వాత ఇక వాటిని గుర్తించలేమని చైనా అధికారులు చెబుతున్నారు. అమెరికా యుద్ధ నౌకకు వార్నింగ్ ఇచ్చేందుకు తమ యుద్ధ నౌకను సిద్ధం చేసినట్లు చైనా వెల్లడించింది.

మేనల్లుడిని చంపి.. బాల్కనీలో పాతేసి..

- ఢిల్లీ నగరంలో ఒడిశావాసి ఘాతుకం
- హైదరాబాద్‌లో పట్టుకున్నపోలీసులు
- గర్ల్‌ఫ్రెండ్‌తో సంబంధముందని అనుమానం

న్యూఢిల్లీ, జనవరి 11: తన గర్ల్‌ఫ్రెండుతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో మేనల్లుడిని చంపేసిన వ్యక్తిని ఢిల్లీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టుచేశారు. హత్య జరిగిన మూడేళ్ల తర్వాత నిందితుడు పట్టుబడటం విశేషం. ఒడిశాలోని గంజామ్ ప్రాంతానికి చెందిన బిజయ్ కుమార్ మహారాణా 2012లో ఢిల్లీకి వచ్చాడు. తన గర్ల్‌ఫ్రెండ్ ఢిల్లీ రావడంతో ఆమె కోసం అతడూ వచ్చేశాడు. ఆ తర్వాత బిజయ్ మేనల్లుడు జైప్రకాష్ కూడా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వచ్చాడు. దాంతో వాళ్లిద్దరూ కలిసి ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో ఒక ఫ్లాటులో ఉండసాగారు. బిజయ్ నోయిడా సెక్టార్ 144లో ఒక ఐటీ కంపెనీలో పని చేస్తుండగా, జైప్రకాష్ గుర్‌గావ్‌లోని ఓ కంపెనీలో పనిచేసేవాడు. కొన్నాళ్ల తర్వాత బిజయ్ గర్ల్‌ఫ్రెండ్‌తో జైప్రకాష్ కూడా సన్నిహితంగా ఉండటం మొదలుపెట్టాడు. అది బిజయ్‌కి నచ్చలేదు. దాంతో ఎలాగైనా అతడిని చంపాలని అనుకున్నాడు. 2016 ఫిబ్రవరి 6వ తేదీ రాత్రి జైప్రకాష్ నిద్రలో ఉండగా ఇంట్లో రిపేరులో ఉన్న సీలింగ్ ఫ్యాన్ మోటారుతో తలపై బాది చంపేశాడు. తర్వాత మృతదేహాన్ని బాల్కనీలోకి లాక్కెళ్లి అక్కడ అంతకుముందే సిద్ధంగా ఉంచుకున్న మట్టిలో కప్పెట్టాడు. తర్వాత ఆ మట్టిమీద కొన్ని మొక్కలు కూడా పెంచాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు అలా చేశాడని పోలీసులు తెలిపారు. వారం రోజుల తర్వాత తన మేనల్లుడు కనిపించడం లేదని.. తన స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫ్లాటులో రెండు నెలలున్న తర్వాత నగరంలోని నంగ్లోయ్ ప్రాంతానికి మారిపోయాడు. 2017లో హైదరాబాద్‌కు మారిపోయాడు. గత సంవత్సరం అక్టోబరు నెలలో వాళ్లు ఉన్న భవనానికి కొద్దిగా మరమ్మతులు చేస్తుండగా.. బాల్కనీలో ఉన్న మట్టిలోంచి అస్థిపంజరం బయటపడింది. దాన్ని ఒక నీలిరంగు జాకెట్, షర్టు, దుప్పటి, పరుపులో కలిపి చుట్టిపెట్టారు. ఫ్లాటు యజమాని ద్వారా పోలీసులకు బిజయ్ గురించి తెలిసింది. మొదట్లో తన ఇంట్లో ఇద్దరు కలిసి ఉండేవారని, కానీ తర్వాత బిజయ్ ఒక్కడే ఫ్లాటు ఖాళీ చేశాడని ఇంటి యజమాని విక్రమ్ సింగ్ తెలిపారు.

వర్మ రాజీనామా



(మొదటి పేజీ తరువాయి)

అలోక్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సీబీఐ డైరెక్టర్ పదవిలో ఎవరైనా రెండేళ్ల పాటు ఉండాలని, కేవలం ప్రధానమంత్రి నేతృత్వంలోని హైపవర్ కమిటీ మాత్రమే తనను తొలగించగలదని ఆయన వాదించారు. దాంతో కోర్టు ప్రభుత్వ ఉత్తర్వులను రద్దుచేసింది. కానీ.. ఆయనను పదవిలో ఉంచాలా లేదా అన్న విషయాన్ని ప్రధానమంత్రి, అతిపెద్ద ప్రతిపక్షం నాయకుడు, ప్రధాన న్యాయమూర్తితో కూడిన హైపవర్ కమిటీ నిర్ణయించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఈ కమిటీకి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ స్థానంలో ఆయన ప్రతినిధిగా నియమించిన జస్టిస్ ఏకే సిక్రీ హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు జస్టిస్ సిక్రీ కూడా వర్మను సాగనంపేందుకే మొగ్గు చూపారు. కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే మాత్రం విజిలెన్స్ నివేదికలో వర్మ లంచం తీసుకున్నట్లు రుజువు కాలేదంటూ డిసెంట్ నోట్ ఇచ్చారు. దాంతో వర్మను పదవి నుంచి తొలగించారు.

బదిలీలు రద్దు

అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించిన మర్నాడే.. అదనపు డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు మరోసారి ఆ బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. గడిచిన రెండు రోజుల్లో అలోక్ వర్మ తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ఆయన రద్దుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో తిరిగి సీబీఐ డైరెక్టర్‌గా పదవి చేపట్టేందుకు వచ్చిన అలోక్ వర్మను స్వయంగా నాగేశ్వరరావే సీబీఐ ప్రధాన కార్యాలయ ప్రవేశద్వారం వద్ద స్వాగతించారు. వర్మ పదవి చేపట్టగానే అంతకుముందు నాగేశ్వరరావు చేసిన బదిలీలన్నింటినీ రద్దుచేయడంతో పాటు కొత్తగా ఐదుగురు అధికారులను బదిలీ చేశారు. ఇప్పుడు నాగేశ్వరరావు మళ్లీ ఆ ఉత్తర్వులన్నింటినీ కొత్త డైరెక్టర్ హోదాలో రద్దుచేశారు. 1986 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐపీఎస్ అధికారి అయిన నాగేశ్వరరావును సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించాలని సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ కోరింది. ఇంతకుముందు అక్టోబరు 23వ తేదీ తెల్లవారుజామున 2 గంటల సమయంలో నాగేశ్వరరావు ఒకసారి సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కట్జు చెప్పడం వల్లేనా?

- వర్మపై వేటుకు జస్టిస్ సిక్రీ మొగ్గు
- ఫేస్‌బుక్‌లో తెలిపిన జస్టిస్ కట్జు



జస్టిస్ ఏకే సిక్రీ ఢిల్లీ హైకోర్టులో జడ్జిగా పనిచేసే సమయంలో జస్టిస్ మార్కండేయ కట్జు అక్కడ ప్రధాన న్యాయమూర్తిగా ఉండేవారు. సీబీఐ డైరెక్టర్ పదవిలో అలోక్ వర్మ కొనసాగడం సరికాదని, ఆయనపై విజిలెన్స్ కమిషన్ వద్దకు వచ్చిన ఆరోపణలలో ప్రాథమిక సాక్ష్యాలున్నందున తప్పించాలని జస్టిస్ సిక్రీ అభిప్రాయపడ్డారు. తాను ఉదయమే జస్టిస సిక్రీకి ఫోన్ చేశానని, అలోక్ వర్మ విషయం ఏమైందని అడిగానని జస్టిస్ కట్జు తెలిపారు. జస్టిస్ సిక్రీ తనకు సమాచారం ఇచ్చారని.. ఈ విషయాన్ని కావాలంటే బయటకు చెప్పచ్చని కూడా ఆయన అనుమతి ఇచ్చారని అన్నారు. ఈ విషయాలన్నింటినీ జస్టిస్ మార్కండేయ కట్జు ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు. అలోక్ వర్మపై ఉన్న కొన్ని తీవ్రమైన ఆరోపణలకు ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని సీవీసీ తెలిపిందని.. దాంతో ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేసి నిజానిజాలు తేల్చేవరకు అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవిలో ఉంచకూడదని జస్టిస్ ఏకే సిక్రీ భావించారని కట్జు తన పోస్ట్‌లో రాశారు. నిందితుడిని విచారించకుండానే సస్పెండ్ కూడా చేయొచ్చని ఒక సార్వత్రిక సిద్ధాంతం ఉందని, అలాగే విచారణ పెండింగులో ఉండగా కూడా సస్పెండ్ చేయడం సాధారణమేనని అన్నారు. వర్మను సస్పెండ్ చేయలేదు.. డిస్మిస్ కూడా చేయలేదని.. కేవలం మరో సమాన పోస్టుకు బదిలీ మాత్రమే చేశారని ఆయన తెలిపారు.

రాకేశ్ ఆస్థానాను అరెస్టు చేయండి

- లంచం కేసులో విచారించండి
- ఢిల్లీ హైకోర్టు బెంచి ఆదేశం



సీబీఐలో నెం.2 స్థానంలో ఉండటంతో పాటు వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న రాకేశ్ ఆస్థానాను అరెస్టు చేయాలని, లంచం కేసులో విచారించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఆస్థానా మీద నమోదైన కేసును రద్దు చేయడానికి కోర్టు నిరాకరించింది. సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దేవేందర్ కుమార్‌తోపాటు, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్‌లపై ఉన్న కేసులను రద్దు చేసేందుకు జడ్జి నిరాకరించారు. దాంతోపాటు.. ఆస్థానాపై నేర విచారణ జరగకుండా ఇంతకుముందు కల్పించిన మధ్యంతర రక్షణను తొలగించారు. ఆస్థానాపై నమోదైన కేసులను 10 వారాల్లోగా విచారించాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. ఆస్థానాపై నేరపూరిత కుట్ర, అవినీతి, నేరపూరిత దుష్ప్రవర్తన ఆరోపణలతో దాఖలైన ఎఫ్ఐఆర్‌లను కోర్టు విచారిస్తోంది. కేసులో ఉన్న వాస్తవాల దృష్ట్యా ఆస్థానా, దేవేందర్ కుమార్‌లపై విచారణకు ముందస్తు అనుమతి ఏమాత్రం అవసరం లేదని జస్టిస్ నజ్మీ వజీరీ తెలిపారు. మాంసం ఎగుమతిదారుడు మొయిన్ ఖురేషీ మీద ఉన్న కేసును తప్పించేందుకు తాను లంచం చెల్లించానంటూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన సానా సతీష్‌బాబు అనే వ్యాపారి ఆరోపించడంతో ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఆస్థానా బాస్, సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ పదవి నుంచి హైపవర్ కమిటీ తప్పించిన ఒక్క రోజులోనే ఆస్థానా అరెస్టుకు ఆదేశాలు రావడం గమనార్హం.

అత్తా అల్లుళ్ల పొత్తు!

(మొదటి పేజీ తరువాయి)



అంటున్నారు. గత కొన్ని వారాలుగా వీరిద్దరి మధ్య ఈ అంశంమై చర్చలు జరుగుతున్నాయి. గత వారం ఢిల్లీలో సమావేశమైనప్పుడు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టేయాలని కూడా నిర్ణయించుకున్నారు. ఈ కొన్ని వారాల్లో మాయావతి, అఖిలేశ్‌లలో ఎవరు మీడియా ముందుకు వచ్చినా కూటమి గురించే మాట్లాడుతున్నారు. అలాగే అఖిలేశ్ యాదవ్ మీద అక్రమ మైనింగ్ లైసెన్సుల విషయమై సీబీఐ దాడులు జరిగినప్పుడు ఆయనకు మాయావతి అండగా నిలబడ్డారు. ఈ దాడులతో ఏమాత్రం భయపడొద్దని ఆమె తన మేనల్లుడికి సలహా ఇచ్చారు. ఒకప్పుడు ఉప్పు-నిప్పులా ఉండే ఈ రెండు పార్టీలు యూపీలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత అనుకోని పరిస్థితుల్లో ఒకటయ్యాయి. విడివిడిగా పోటీచేస్తే ఓట్లు చీలిపోవడం తప్ప ప్రయోజనం ఉండబోదని తెలుసుకున్నాయి. గోరఖ్‌పూర్ పార్లమెంటరీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడే అఖిలేశ్‌ను మాయావతి తన 'భతీజా' (అన్న కొడుకు) అని పిలిచారు. వెంటనే అఖిలేశ్ కూడా స్పందించి.. ఆమెను 'భువాజీ' (మేనత్త) అని సంబోధించారు. అప్పటినుంచి వారిద్దరూ యూపీ అత్తా అల్లుళ్లుగా ప్రచారంలోకి వచ్చారు. ఆగ్రాలో నిర్వహించిన ఒక ర్యాలీలో మాయావతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను అఖిలేశ్ యాదవ్ ఖండించారు. తమ కూటమి అంటే మోదీ భయపడుతున్నారని చెప్పారు. రాష్ట్రీయ లోక్‌దళ్, నిషాద్ పార్టీలు కూడా ఈ కూటమిలో చేరే అవకాశం కనిపిస్తోంది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఎప్పుడూ పోటీ చేసే అమేథీ, రాయ్‌బరేలి స్థానాలలో మాత్రం తమ పోటీ పెట్టకూడదని మాయావతి - అఖిలేశ్ నిర్ణయించారు. వీళ్లిద్దరూ ఇలా చేస్తారని ముందునుంచే ఊహించారో ఏమో గానీ.. కాంగ్రెస్ పార్టీ మాత్రం ముందునుంచి యూపీ ఎన్నికల్లో ఒంటరి పోటీవైపే మొగ్గు చూపుతోంది. కానీ ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాగే పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తే ఫలితాలు పూర్తి నిరాశాజనకంగా ఉంటాయన్న భయం కూడా కాంగ్రెస్‌కు ఉంది. 2014 ఎన్నికల్లో బీజేపీ, అప్నాదళ్ కలిసి యూపీలో ఉన్న 80 లోక్‌సభ స్థానాల్లో 73 చోట్ల విజయం సాధించాయి. కాంగ్రెస్ పార్టీతో కలిసి తిరిగి అధికారాన్ని చేపట్టాలని అఖిలేశ్ భావించి పొత్తు పెట్టుకున్నా.. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. దీంతో ఇన్నాళ్లుగా తమ మధ్య ఉన్న శత్రుత్వాన్ని పక్కన పెట్టి కలిసి పోటీ చేయాలని మాయావతి, అఖిలేశ్ నిర్ణయించుకున్నారు. దాంతో ఉప ఎన్నికలు జరిగినప్పుడు గోరఖ్‌పూర్‌లోనిషాద్ పార్టీ, కైరానాలో రాష్ట్రీయ లోక్‌దళ్, ఫూల్‌పూర్‌లో సమాజ్‌వాదీ గెలిచాయి. దాంతో ఈ కూటమిపై ఆశలు పెరిగాయి. బీజేపీని పూర్తిగా ప్రజలకు దూరం చేయాలంటే తాము కలిసి పోటీ చేయడం ఒక్కటే మార్గమని భావిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే కూటమితో పోటీచేస్తే ఇవే తరహా ఫలితాలు రాష్ట్రమంతా వస్తాయని ఆశిస్తున్నారు. ఒకవేళ నిజంగా ఇదే జరిగితే మాత్రం ఇటీవల మూడు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయిన బీజేపీకి చాలా పెద్ద తలనొప్పి అవుతుంది.



వృద్ధుల పింఛన్ 2 వేలు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే తన సంక్రాంతి కానుక అని తెలిపారు. పాత, కొత్త పింఛన్లు కలిపి ఫిబ్రవరి నెలలో రూ.3వేలు అందిస్తామన్నారు. మార్చి నుంచి అంతా రూ.2వేలు పింఛను తీసుకుంటారని స్పష్టంచేశారు. నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా బోగూరులో నిర్వహించిన 'జన్మభూమి - మాఊరు' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులెవరూ అధైర్యపడొద్దని అప్పట్లో రూ.200గా ఉన్న పింఛనును రూ.1000కి పెంచామన్నారు. దాన్ని మరోసారి రెట్టింపు చేస్తూ జనవరి నుంచి నెలనెలా రూ.2వేలు చొప్పున ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని భరోసా ఇచ్చానని గుర్తు చేశారు. నెలనెలా ఉద్యోగులకు ఎలాగైతే జీతాలు వస్తాయో.. అదే తరహాలో పింఛన్లు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. వృద్ధులు, వితంతువులు వయోభారంతో, మందులు కొనుక్కొనేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను దృ ష్టిలో పెట్టుకొనే పింఛన్లు పెంచామన్నారు. ఎంత ఖర్చయినా పర్వాలేదని, పేదల సంక్షేమమే తనకు ముఖ్యమని చెప్పారు. సంపద సృష్టించి రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతానని.. తిరిగి ఆ సంపదను ప్రజలకే పంచుతానని చంద్రబాబు తెలిపారు. ప్రతినెలా ఇచ్చే పింఛను సొమ్ము రెట్టింపు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా 54లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరనుంది.

మా ఇష్టం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలోనూ కోడిపందేల జోరు గట్టిగానే కనిపిస్తోంది. అటు ఉత్తరాంధ్ర జిల్లాలలకు కూడా ఇది కొంతవరకు పాకింది. ప్రధానంగా పండుగ మూడు రోజుల పాటు బరులు పెట్టడానికి ఒక్కో శిబిరానికి దాదాపు రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో కోడిపందేలు లేనిదే అసలు సంక్రాంతి పండగ అన్నదే ఉండదు. దాంతో ఎలాగైనా వీటికి అనుమతులు కావాలని ప్రజాప్రతినిధుల నుంచి కూడా తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉండటంతో పోలీసులు సైతం ఇదే బాగుందని అనుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఏర్పాట్లు షురూ

సంవత్సరానికి ఒక్కసారి ఉత్సాహంగా జరుపుకొనే ఈ పండుగలో కోడి పందేలు అన్నవి సంప్రదాయం అయితే.. వాటితో పాటే పేకాట, గుండాట, మద్యం విక్రయాల లాంటివి కూడా యథేచ్ఛగా జరిగిపోతుంటాయి. పందేల నిర్వహణకు బరులు గీసుకుని.. అక్కడ స్థలాలు చదును చేయడం, టెంట్లు వేయించడం లాంటి ఏర్పాట్లన్నీ పూర్తిచేసేసుకున్నారు. పందేలను చూసేందుకు వచ్చే వారికి సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సమీపంలోనే బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మిస్తున్నారు. ఒకేచోట టిఫిన్, భోజన వసతి కూడా కల్పిస్తున్నారు. కారు, బైక్ పార్కింగ్‌లు సైతం ఉన్నాయి. వీటిని శిబిరాల వద్ద ఏర్పాటు చేసుకునేవారి వద్ద నుంచి నిర్వాహకులు ముందుగానే డబ్బులు వసూలు చేశారు. బరుల నిర్వహణలో రాజకీయ నాయకులదే కీలక పాత్ర. వారే దగ్గరుండి మరీ వీటి ఏర్పాట్లు చూస్తున్నారు. పోలీసుల అనుమతి లేని ప్రాంతాల్లో పందెంరాయుళ్లు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఊరికి దూరంగా పంటపొలాల్లో, వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా బరులు సిద్ధం చేసుకున్నారు. ఎవరైనా దాడులకు వస్తే.. ఐదారు కిలోమీటర్ల ముందు నుంచే సమాచారం అందుకునే ఏర్పాట్లు చేసుకున్నారు.



భారీ స్థాయిలో జూదం

సంక్రాంతి సీజన్‌లో జరిగే కోడి పందేలు నాణానికి ఒక వైపు మాత్రమే. వీటి ముసుగులో బెట్టింగ్ మాఫియా నడుస్తోంది. కోడి పందేల శిబిరానికి కొంచెం దూరంలో.. భారీస్థాయిలో జూదశిబిరాలు వెలుస్తున్నాయి. వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన బెట్టింగ్ రాయుళ్లు.. పండుగ సీజన్‌ను క్యాష్ చేసుకునేందుకు రంగంలోకి దిగుతున్నారు. 'కోసు'లు ఏర్పాటుచేసి పేకాట నిర్వహిస్తున్నారు. ఈ కోసుల వద్ద నిర్వాహకులు ఒక టీంగా ఏర్పడి, అమాయకులను దోచుకుంటున్నారు. సరదా కోసం శిబిరాల దగ్గరకు వెళుతున్న వారు.. చేతి చమురును వదలించుకుని, తిరుగుపయనం అవుతారు. పండుగ మూడు రోజుల పాటు మాత్రం.. ఈ శిబిరాలు 24 గంటలూ నడుస్తాయి. ఒక్క శిబిరం వద్దే రోజూ కనీసం రూ. 25లక్షల నుంచి రూ. 2కోట్ల వరకు ఆట సాగుతుంది. కృష్ణా, ఉభయగోదావరి, గుంటూరు జిల్లాల్లో వీటి నిర్వహణ పోలీసులకు వరంలా మారింది. రాజకీయ నాయకుల ఒత్తిడి కూడా ఉండటంతో పోలీసులు ఇక ఇటు కన్నెత్తి కూడా చూసే అవకాశం కనిపించడం లేదు.

అక్కడక్కడ తొలగింపు

చాలా ప్రాంతాలలో ఇప్పటికే భూములంతటినీ చదునుచేసి బరులు సిద్ధం చేస్తుండగా, కొన్ని చోట్ల మాత్రం బరులను తొలగించేందుకు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుంటున్నారు. బరుల ఏర్పాట్లన్నింటినీ తొలగించడంతో పాటు.. కోడి పందాలు నిషేధం అన్న బోర్డులు కూడా తగిలిస్తున్నారు. కానీ వారిమీద నాయకుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉండటంతో ఈ హడావుడి ఇంకెన్నాళ్లు అన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి.

ఐకానిక్ బ్రిడ్జి

నేడు సీఎంతో శంకుస్థాపన



- 1300 కోట్లతో నిర్మాణం
- ఏడాదిలోగా పనులు పూర్తి
- మంత్రి ఉమామహేశ్వరరావు

అమరావతి, జనవరి 11: అమరావతి సిగలో మరో కలికితురాయి చేరనుంది. శనివారం రూ.1300 కోట్లతో చేపట్టనున్న ఐకానిక్ బ్రిడ్జికి పవిత్ర సంగమం దగ్గర సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. ఏడాదిలోగానే ఐకాన్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికానుంది. మైలవరంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఎనిమిదివందల అడుగుల ఎత్తులో 50 అంతస్థుల్లో అమరావతి అసెంబ్లీ నిర్మాణం కానుందని చెప్పారు. లక్ష కోట్ల అప్పుతో, 16వేల లోటు బడ్జెట్ తో విడగొట్టారని అన్నారు. చెట్టుకింద బస్సు పెట్టుకుని సీఎం పరిపాలన చేపట్టారని చెప్పారు. అమరావతి రైతులు రెండు పంటలు పండే 34వేల ఎకరాలను రూపాయి ఆశించకుండా నమ్మకంతో ఇచ్చారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో 24గంటల్లో 32వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి రికార్డు సృష్టించామన్నారు. పోలవరం పనులను రేయింబవళ్లు చేపట్టామని పేర్కొన్నారు. ఇంటింటికీ కుళాయి పథకం కు జిల్లాకు 900కోట్లు ఇస్తే, మైలవరం నియోజకవరానికే సీఎం 186.91కోట్లు ఇచ్చారని చెప్పారు. కుళాయి పనులను పోరాట్ నగర్ నుంచి, కొండపల్లి నుంచి ప్రారంభించామన్నారు. వెయ్యి కోట్లు విలువ చేసే ఇళ్ల పట్టాలు ఇస్తేంటే పేదల కళ్ళల్లో ఆనందం కనిపిస్తోందని చెప్పారు. పూరగుట్టును చదునుచేసి మరో వెయ్యి ఇళ్ళ పట్టాలిస్తున్నామని వెల్లడించారు. 33 చెరువులకు 22 కొత్త లిఫ్ట్ లు పెట్టి 7వేల ఎకరాలకు సాగునీరిస్తున్నామని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు చేసినా అభివృద్ధి ఆగదని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధికి అడ్డుపడితే అదోపాతాళమేనని హెచ్చరించారు. తాను పేదల పక్షపాతినని, లేనివాడి పక్షమే ఉంటానిని పేర్కొన్నారు. రాజకీయాలకు, జెండాలకు ఇది సమయం కాదని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగానే అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. దేశం యావత్తు విస్తుపోయేలా, అన్ని రాష్ట్రాలు అమరావతి వైపు చూసేలా ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుందని చెప్పారు.కూచిపూడి నాట్యభంగిమ ఐకానిక్ బ్రిడ్జికి పవిత్ర సంగమం దగ్గర శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పనులను ఏడాదిలోపే పూర్తయ్యేలా ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారని తెలిపారు. లక్ష కోట్ల అప్పుతో 16వేల కోట్ల లోటు బడ్జెట్ తో ఆంధ్రప్రదేశ్ ను విడగొట్టి, కట్టుబట్టలతో సీమాంధ్రులను బెజవాడ పంపారని, ఒక చిన్న చెట్టుకింద బస్సు పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చేపట్టారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దక్షతను చూసి, అమరావతి రైతులు రెండు పంటలు పండే 34వేల ఎకరాలను రూపాయి కూడా ఆశించకుండా రాజధాని నిర్మాణం కోసం ఇచ్చారని చెప్పారు. ప్రజలందరూ ఒకసారి అమరావతి నిర్మాణం పనులను చూసి తరించాలని పిలుపునిచ్చారు.



చిత్తూరు జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 'మనం' దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్ రెడ్డి. చిత్రంలో జిల్లా కలెక్టరు పీఎస్ ప్రద్యుమ్న, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ గిరిషా, ఎంపీ ఎంపీ శివప్రసాద్, ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ, ఎమ్మెల్సీ దొరబాబు, నగర మేయర్ కఠారి హేమలత తదితరులు ఉన్నారు.

రాష్ట్రానికి మోదీ మోసం

- హోదా ఇవ్వకుండా వంచన
- అభివృద్ధికి కేంద్రం మద్దతు కరువు
- ప్రశ్నిస్తే ఐటీ, ఈడీ దాడులు
- లోటు బడ్జెట్ ఉన్నా అభివృద్ధికి కృషి
- పెద్దాపురంలో జన్మభూమిలో లోకేశ్

పెద్దాపురం, జనవరి 11(మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా సీఎం చంద్రబాబునాయుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. పెద్దాపురంలో శుక్రవారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రానికి రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉందని అన్నారు. అయినా 68 ఏళ్ల వయస్సులోనూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి కష్టపడుతున్నారన్నారు. సీఎం ఇంతలా కష్టపడుతుంటుంటే హోదా ఇచ్చి ప్రోత్సహించాల్సిన ప్రధాని నరేంద్రమోదీ నమ్మకద్రోహం చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని, ఆర్బీఐ,సీబీఐ వ్యవస్థలను భ్రష్టుపట్టించారన్నారు. ఆఖరికి సుప్రీం కోర్టు తీర్పుని కూడా లెక్క చెయ్యను అన్న రీతిలో ఉన్నారన్నారు. హోదా కోసం పోరాటం చేస్తుంటే పార్లమెంట్ సాక్షిగా మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారన్నారు. బెదిరిస్తారు కడప ఉక్కు ఫ్యాక్టరీ గురించి నిలదీస్తే ఐటీ రైడ్స్ చేయించారని, విశాఖ రైల్వే జోన్ కావాలి అని అడిగితే ఈడీ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అన్నా, తెలుగు ప్రజలు అన్నా మోడీ గారికి చులకన భావన అని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ని లుచ్చా అని రాష్ట్ర బీజేపీ నాయకులు అంటుంటే ప్రధాని మోదీ ఆనందంగా నవ్వుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర బీజేపీ నేతలకు దమ్ముధైర్యం ఉంటే రాష్ట్రానికి న్యాయం చేయాలని మోదీని డిమాండ్ చేయాలన్నారు. కాగా, పిఠాపురంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రూ.31.30 కోట్ల వ్యయంతో నిర్మించిన అర్బన్ వాటర్ స్కీంను మంత్రి ప్రారంభించారు. రూ.27 కోట్ల అంచనా వ్యయంతో పిఠాపురం మండలం,మాధవపురం మల్టీ విలేజ్ తాగునీటి పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జలధార కార్యక్రమంలో భాగంగా పిఠాపురం యూ కొత్తపల్లి మండలంలో మల్టీ విలేజ్ స్కీం తాగునీటి పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా 54 నివాస ప్రాంతాలకు తాగునీరు అందనుంది.



ఎన్ఐఏ కస్టడీకి శ్రీనివాసరావు

విజయవాడ, జనవరి 11: ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావుని వారం రోజులు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించాలని రాష్ట్రపోలీస్‌శాఖను విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఆదేశించింది. నిందితుడికి వైద్య పరీక్షలు చేయించిన తర్వాతే ఎన్ఐఏకు అప్పగించాలని, ప్రతి మూడు రోజులకు ఒకసారి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. శ్రీనివాస్ కోరితే న్యాయవాది సమక్షంలోనే విచారణ చేపట్టాలని, విచారణలో భాగంగా నిందితుడిపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించరాదని స్పష్టం చేసింది. విశాఖ విమానాశ్రయంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన కేసును ఇటీవల కేంద్ర హోంశాఖ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కి అప్పగించిన సంగతి తెలిసిందే. వెంటనే రంగంలోకి దిగిన ఎన్ఐఏ అధికారులు విచారణ మొదలుపెట్టారు.



వృద్ధుల జీవితాల్లో వెలుగు

అదే సీఎం చంద్రబాబు ధ్యేయం.. ప్రభుత్వ విప్ కూన రవికుమార్

పొందూరు, జనవరి 11 (మనం న్యూస్):రాష్ట్రంలో పేదసా కూలీ వృద్ధుల జీవితాల్లో ఆనంద వెలుగులు చూడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 6వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రజలకు సేవలందించే ఘనత చంద్రన్నకే ఉందన్నారు. రాష్ట్రంలో పేదరికం లేని పాలన చేసేందుకు చంద్రబాబు పూనుకున్నారని అందుకు నిరంతరం ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. చంద్రన్న సర్కారు మాటలతో చెప్పేది కాదన్నారు.

భావనపాడు పోర్టుకు ఓకే

అంగీకరించిన గ్రామ ప్రజలు

- పోర్టు కమిటీ సమావేశంలో ఆమోదం

శ్రీకాకుళం, జనవరి 11(మనం న్యూస్ బ్యూరో): శ్రీకాకుళం జిల్లా భావనపాడు పోర్టు నిర్మాణానికి స్థానిక ప్రజలు అంగీకరించారు. భావనపాడు పోర్టు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ చేయుటకు సమ్మతిని తెలిపారు. సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామంలో భావనపాడు పోర్టు ప్రాజెక్టు కమిటీ సమావేశం శుక్ర వారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ కె.ధనంజయ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర బాబు, పోర్టు డైరక్టర్ కోయ ప్రవీణ్, రెవిన్యూడివిజనల్ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, భావనపాడు, మర్రిపాడు, దేవునల్తాడ గ్రామాల నుండి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. భావనపాడు గ్రామ పంచాయతీ పోర్టు నిర్వాసితుల హక్కుల సాధన కమిటి అధ్యక్షులు కారాడ పోతయ్య, ఉపాధ్యక్షులు సైన గురువులు, సహకార్యదర్శి కారాడ నీలకంఠేశ్వర రావు తదితరులు భావనపాడు పోర్టు నిర్మాణం, పునరావాస కాలనీలో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై మంత్రికి వినతి పత్రం సమర్పించారు. 1980వ దశకంలో ప్రతిపాదించిన భావనపాడు పోర్టు నిర్మాణానికి ప్రస్తుతం ముందుకు రావడం సంతోషాన్ని వ్యక్తం చేసారు. అయితే అనాధిగా చేపల వేట వృత్తిగా జీవనం సాగిస్తున్న తమకు సర్వం కోల్పోతున్నామనే బాధ ఉందన్నారు. పోర్టుతోపాటు ఫిషింగు హార్బర్ నిర్మించాలని, ప్రస్తుతం నివశిస్తున్న గ హాలకు మార్కెట్ ధరను నిర్ణయించి దానికి ఐదు రెట్లు ధరను చెల్లించాలని, పశువుల శాలలు, చేపల వ్యాపారుల శాలలు, ఇతర నిర్మాణాలకు వాటి నిర్మాణ వ్యయానికి మూడు రెట్లు అదనంగా చెల్లించాలని, పంట భూములకు, డి ఫారం పట్టాలకు, వృక్షాలకు, బావులకు, బోర్లకు, పశుసంపదకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మత్స్యకార ప్యాకేజీ క్రింద కుటుంబంలోని ప్రతి సభ్యునికి రూ.2 లక్షలు చొప్పున ఏకకాల పద్ధతిలో చెల్లింపు చేయాలని, జీవన భ తి కోల్పోతున్నందున కుటుంబంలోని ప్రతి సభ్యునికి నెలకు రూ.10 వేల చొప్పున పది సంవత్సరాల వరకు చెల్లించాలని కోరారు. మెరైన్ బోట్లను ఉచితంగా లేదా 90 శాతం రాయితీతో డీప్ ఫిషింగు చేయుటకు సమకూర్చాలని, గృహ



నిర్మాణానికి ఏడు సెంట్ల స్థలాన్ని, రూ.15 లక్షలను చెల్లించాలని, ఒక ఇంటిలో వివిధ కారణాల వలన ఎక్కువ కుటుంబాలు నివశిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు ఒక్కో ఇళ్ళు మంజూరు చేయాలని కోరాయి. పోర్టులో ప్రతి విభాగంలో స్థానికులకు ప్రాధాన్యతను కల్పించాలని పేర్కొంటూ అధికార స్థాయి ఉద్యోగాల్లో 10 శాతం, ఇంజనీరు, సూపర్వైజింగు స్థాయి ఉద్యోగాల్లో 30 శాతం., వెల్డింగు, ఫిట్టర్ ఉద్యోగాల్లో 50 శాతం, క్రింది స్థాయి ఉద్యోగాల్లో 70 శాతం తమకు ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన వారికి రూ.5 వేల పింఛను చొప్పున 20 సంవత్సరాలు చెల్లించాలని, పునరావాస కాలనీకి తరలి వెళ్ళుటకు రవాణా చార్జీగా రూ.75 వేలు చెల్లించాలని, పునరావాస కాలనీని అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేయాలని, జూనియర్ కళాశాల వరకు విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని, 10 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఇతర మౌళికవసతులు పూర్తి స్థాయిలో కల్పించాలని, గ్రామాల్లో ఉన్న ఒక్కో దేవాలయానికి 3 ఎకరాల వరకు స్థలం కేటాయించాలని, వాటి నిర్మాణ వ్యయం అందించాలని కోరారు. మర్రిపాడు గ్రామ ప్రజలు అట్టాడ రాంప్రసాద్ నేత త్వంలో తమ ప్రతిపాదనలు సమర్పిస్తూ వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.60 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, ప్రతి ఎకరాకు అమరావతి తరహాలో అగనంగా 20 సెంట్ల భూమిని వాణిజ్య సముదాయంలో కేటాయించాలని కోరారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజలను కష్టాల్లోకి నెట్టి పోర్టు నిర్మించాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదన్నారు. పోర్టుతోపాటు ఫిషింగు హార్బర్ నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. పోర్టు నిర్మాణం వలన గ్రామాలు తరలుతాయని, పునరావాస కాలనీల్లో పూర్తి సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. ఎటువంటి ఆందోళన అవసరం లేదని మంత్రి స్పష్టం చేసారు. 2013 భూ సేకరణ చట్టంకు అనుగుణంగా భూసేకరణ జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజల అంగీకారంతో మాత్రమే భూ సేకరణ చేస్తామని మంత్రి పేర్కొనగా ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలతో సమ్మతిని తెలిపారు. రామాయపట్నం, గంగవరం, కొవ్వాడ వంటి ప్రాజెక్టులు ఇటీవల కాలంలో చేపట్టారని అచ్చట పరిస్థితులు సైతం అధ్యయనం చేసి భావనపాడు పోర్టులో ఆస్తులు, భూములు కోల్పోతున్న ప్రజలకు ప్రత్యేక అంశంగా పరిగణించి సాధ్యమైనంత మంచి ప్యాకేజి న్యాయపరంగా లభించే చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. మర్రిపాడు గ్రామస్తులు 80 శాతం మేర భూములను కోల్పోతున్నారని వారికి ఎటువంటి ఇబ్బందిలేకుండా న్యాయం జరుగుటకు కృషి చేస్తామన్నారు. ప్రజల అంగీకారం మేర పాత నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి తెలిపారు. పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లా ప్రజల చిరకాల కోరిక భావనపాడు అన్నారు. ఉద్యోగాలు లేక జిల్లా యువత, పేదలు ఇతర ప్రాంతాలకు వలసలు వేలుతున్నారని అన్నారు. గుజరాత్ వంటి సుదూర ప్రాంతాలకు వెళుతున్నారని, పాకిస్తాన్ కు చిక్కిన వారిలో 15 మంది శ్రీకాకుళం జిల్లా వాసులని అన్నారు. భావనపాడు, దేవునల్తాడ గ్రామాల ప్రజలు ముత్తాతల నుండి జీవిస్తున్నారని అటువంటి గ్రామాలను విడిచి వెళ్ళటం వాటితో ఉన్న అనుబంధం మేరకు కష్టతరమైందన్నారు. అదేసమయంలో భవిష్యత్తులో ఉద్యోగాల ఆశ, తరువాతి తరాలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక పరిస్థితులు మెరుగు వంటి పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఆశలను అవకాశాలుగా మలచుకోవాలని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు లేక ఇబ్బందులు కలుగుతుంటే వంశధార, ఆఫ్ షోర్ ప్రాజెక్టులకు వెయ్యి కోట్ల నిధులను తీసుకు వచ్చిన ఘనత రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు దక్కుతుందని అన్నారు. భావనపాడు, దేవునల్తాడ గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలకు రెట్టింపు సౌకర్యాలు వస్తాయని, స్మార్ట్ సిటీస్థాయిలో ఉండేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్వే శాఖ సహాయ సంచాలకులు డి.బి.డి.బి.కుమార్, భావనపాడు ప్రత్యేక అధికారి ఆదినారాయణ, జెడ్పిటిసి లమత లక్ష్మి, ఎల్.ఎల్.నాయుడు, మండల ప్రత్యేక అధికారి మరియు మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వి.వి.కష్ణమూర్తితదితరులు పాల్గొన్నారు.

వారే బ్రాండ్ అంబాసిడర్స్..

- నోవాటెల్‌లో తెలుగు రుచుల పండుగ

విజయవాడ, జనవరి 11: తెలుగు ప్రజలకు మాత్రమే పరిమితమైన ప్రత్యేక అంశాలకు భౌగోళిక సూచిల సాధనకు పర్యాటక శాఖ బాధ్యత తీసుకుంటున్నట్టు పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. రాష్ట్ర ఆహారం నచ్చితే, వారే ఆంధ్రప్రదేశ్ రాయబారులు అవుతారని మీనా ఆశాభావం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 66 రుచులతో ప్రత్యేక పుస్తకాన్ని నోవాటెల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా తెలుగు రుచుల పండుగను (ఫుడ్ ఫెస్టివల్)ప్రారంభించారు. నిబంధనల ప్రకారం హక్కుదారులు మాత్రమే పేటెంట్ పొందేందుకు అర్హులు అయినప్పటికీ రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ సమన్వయ బాధ్యతను తీసుకోనుందని వివరించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేందుకు ఆయుధంగా మంచి ఆహారం పనికొస్తుందన్నారు. 10 రోజులపాటు ఈ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగనుంది. రాష్ట్రానికి వస్తున్న దేశీయ పర్యాటకుల సంఖ్య ఏడాదికి 19 కోట్లకు చేరిందని మీనా వివరించారు. సీఎం చంద్రబాబు పర్యాటక ప్రగతి విషయంలో నిశిత దృష్టి సారించారని పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ అచార్య జయరామి రెడ్డి అన్నారు.

స్ఫూర్తి నింపేలా 'ఎన్‌టీఆర్'

- బయోపిక్ చిత్రం అద్భుతం: చంద్రబాబు

అమరావతి, జనవరి 11: ప్రతి ఒక్కరిలోనూ స్ఫూర్తినింపేలా ఎన్‌టీఆర్ బయోపిక్ చిత్రం ఉందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. కథానాయకుడు సినిమా అద్భుతంగా ఉందని, యుగ పురుషుని జీవితం తీయడం నిజంగా సాహసమని ప్రశంసించారు. జన్మభూమిపై టెలీకాన్ఫరెన్స్‌సందర్భంగా శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం విజయవాడ బెంజి సర్కిల్‌లోని ఓ థియేటర్‌లో ఆయన ఈ చిత్రాన్ని చూశారు.

కోటా.. ఎన్నికల ఎత్తుగడ

- 2019 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మోదీ వ్యూహం
- అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ల బిల్లు అందులో భాగమే..
- కొనసాగుతున్న రాజ్యాంగ వ్యవస్థల ధ్వంస రచన
- సీబీఐ చీఫ్ వ్యవహారంలో 'సుప్రీం'కు అవమానం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజం



అనంతపురం, జనవరి 11, (మనం ప్రతినిధి) : అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టడం వెనుక.. ఆమోదించడం వెనుక.. పెద్ద కుట్ర దాగుందని, 2019 ఎన్నికలలో అగ్రకులాల ఓట్లు గంపగుత్తగా పొందడం కోసమే ప్రధాని నరేంద్రమోడీ పెద్ద స్కెచ్ వేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. శుక్రవారం అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఐదు రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో మూడు ప్రధాన రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఘోరంగా ఓడిపోవడంతో ప్రధాని మోడీ దిమ్మతిరిగిపోయిందన్నారు. 2019 దేశవ్యాప్తంగా జరగనున్న ఎన్నికల్లో బీజేపీ గెలవడం కష్టంగా ఉందన్న అభిప్రాయానికి వచ్చిన ప్రధాని మోడీ అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అన్న నాటకం ప్రారంభించాడని దుయ్యబట్టారు. రిజర్వేషన్ల అంశంపై ఎక్కడా చర్చ చేయలేదు.. రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోలేదు.. కనీసం బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లలేదు.. చివరికి మంత్రివర్గ సహచరులకు విషయాన్ని చెప్పకుండా అకస్మాత్తుగా మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి రిజర్వేషన్ల నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. అగ్రకుల పేదలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు క్యాబినెట్‌లో తీర్మానం చేసి లోక్‌సభలో బిల్లు పెట్టారని, దాని ప్రకారం రూ.8 లక్షలు ఆదాయం ఉండేవారు కూడా నిరుపేదలేనని ప్రకటించారని తీవ్రంగా విమర్శించారు. అసలు దేశంలో నిరుపేదలు ఎవరంటూ ఎద్దేవా చేశారు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు కల్పించిన ఈ పెద్ద మనుషులు ఇంతకాలం బీసీలకు, ఎస్సీలకు క్రిమిలేయర్ ఉండాలని గగ్గోలు పెట్టారని, వారికి రూ.4 లక్షలు ఆదాయ పరిమితి విధించారని, ఇప్పుడేమో వారే రిజర్వేషన్లు ప్రవేశపెట్టి ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచడమేమిటని ప్రశ్నించారు. అలోక్‌వర్మ సీబీఐ డైరెక్టర్‌గా కొనసాగితే ఎక్కడ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కుంభకోణం వెలుగులోకి వస్తుందోనన్న భయంతోనే మోదీ కుట్రలు పన్నుతున్నారన్నారు. కుతంతాలతో వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం చంద్రబాబు మేల్కొన్నారని, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విలువైన భూములను తెలుగుదేశం నాయకులకు, కార్యకర్తలకు దోచిపెట్టేందుకు సిద్ధమయ్యాడని రామకృష్ణ ఆరోపించారు. చుక్కల భూముల టీడీపీ వారికి కట్టబెట్టేందుకు సమాయత్తం అవుతున్నారని అన్నారు.

కుల రాజకీయాలొద్దు

- అభివృద్ధి రాజకీయాలు కావాలి
- అందుకోసమే పార్టీని పెట్టాను
- కృష్ణా జిల్లా నేతలతో పవన్



అమరావతి, జనవరి 11: రాజకీయాల్లో నిలబడడానికి ముందు గుండెల నిండా ధైర్యం కావాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సమాజంలో మార్పు రావాలంటే కనీసం పదేళ్ల సమయం కావాలని అన్నారు. కృష్ణా జిల్లా సమీక్ష సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం పవన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పస్థానం ప్రారంభించే ముందు తనను తాను ప్రశ్నించుకున్నానని, నిలబడగలనా లేదా అని నన్ను నేను పరీక్షించుకున్నానని చెప్పారు. కొందరు వ్యక్తులు వ్యవస్థని వాడుకుని వ్యక్తులు బలపడుతున్నారని, వ్యవస్థని నాశనం చేస్తున్నారని అన్నారు. వారికి వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు. తాను పార్టీ పెట్టి పోటీ చేసే ముందు క్షేత్ర స్థాయిలో ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు ప్రయత్నించానన్నారు. 25 కేజీల బియ్యం వద్దు 25 సంవత్సరాల భవిష్యత్తు కావాలి అన్న మాట క్షేత్ర స్థాయిలో ఓ సామాన్యుడి కడుపు మంట నుంచి పుట్టిందేనని పేర్కొన్నారు. తాను సినిమాల్లో డబ్బు సంపాదిస్తున్న సమయంలో.. ఎవరైనా ఇబ్బంది అంటూ వస్తే నాకు తోచిన సాయం చేస్తూ వచ్చానన్నారు. కానీ రాను రాను సమస్యలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వచ్చిందని, అందరి సమస్యలకీ పరిష్కార మార్గం చూడాలంటే దాన్ని పొలిటికల్ ప్రాసెస్ ద్వారానే చేయగలమనిపించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డదిడ్డంగా విడగొడుతుంటే, అందరినీ అవమానిస్తుంటే ఏ ఒక్కరూ కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదని అన్నారు. గెలుస్తామా.? లేదా అని ఆలోచిస్తూ పార్టీ పెట్టలేదని, పోరాటం చేసేందుకే జనసేనని స్థాపించానని స్పష్టం చేశారు. మన వ్యవస్థలో కుల వ్యవస్థ బలంగా పెనవేసుకుపోయిందని, కులాల ఆలోచనలు, కులాల మధ్య ఘర్షణలుహా అధిగమించకపోతే సమాజిక వినాశనం తప్పదని అన్నారు. రాజకీయ పార్టీ నడపడానికి కోట్ల రూపాయిల పెట్టుబడి అవసరం లేదని, ఆశయాలు, భావజాలం బలంగా ఉంటే చాలని అన్నారు. పార్టీ బలం పెరిగిన నేపథ్యంలో జిల్లా స్థాయి కమిటీల మీద భారం పడుతుందని, అందుకే ఇప్పుడు పార్లమెంటరీ స్థాయి కమిటీలు వేయాలని నిర్ణయానికి వచ్చానని చెప్పారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శనివారం, జనవరి 12

పశ్చాత్తాపం పనిచేస్తుందా?


ఇటీవల వరుసగా కొన్నిరాయితీలు ప్రకటిస్తూ రైతులు, చిన్నవ్యాపారులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. గత డిసెంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల్లో తీవ్ర వ్యతిరేకతను చవిచూసిన నేపథ్యంలో నష్టపరిహార చర్యలకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఆసియాలోనే మూడో అతిపెద్ద ఆర్థిక రంగంగా పేరుపొందిన దేశంలో నేడు రాయితీలు వెల్లువెత్తుతున్నాయి. గత దశాబ్ద కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న బడ్జెట్ లోటును సవరించడం కోసం స్థూల దేశీయ ఉత్పత్తిలో లక్ష్యంగా పెట్టుకున్న 3.3 శాతానికి తీసుకొచ్చేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం తీవ్రంగా కృషిచేస్తోంది. వచ్చే మే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలోపు మరిన్ని రాయితీలతో ప్రజల ముందుకువస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్యల్లో అభివృద్ధి, పారదర్శకత చోటుచేసుకుంటాయని కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ ప్రకటించిన విషయం విదితమే. ఇంతవరకు ఎన్నికల్లో మేము గెలిచామా, ఓడామా అన్నదానితో సంబంధం లేకుండా భవిష్యత్తులో తాము ప్రజల విశ్వాసాన్ని పొందుతామని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

ప్రభుత్వం వరుసగాప్రకటిస్తున్నరాయితీల కోసం మార్చినాటికి 300 బిలియన్ల నుంచి 400 బిలియన్ల వరకు ప్రభుత్వానికి తాత్కాలిక డివిడెండ్‌ను రిజర్వ్ బ్యాంక్ అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తద్వారా ఆర్థికలోటు ప్రభావం వచ్చే ఎన్నికలపై పడకుండా ఉండే చర్యలకు ప్రభుత్వం యోచిస్తున్నదని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. భవిష్యత్తులో కల్పించే రాయితీల్లో వందల కోట్ల డాలర్లను వ్యవసాయ రుణాల మాఫీ కింద విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం పట్ల రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించే చర్యలు చేపట్టే అవకాశాలున్నాయి. రైతు రుణమాఫీ ప్రకటనల వల్లనే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ ఓడిందని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. చిన్న వ్యాపారులను దరిచేర్చుకునేందుకు జాతీయ ఆదాయపు పన్ను నుంచి రెండు లక్షల మందికి మినహాయింపులు కల్పిస్తూ గత పదో తేదీన ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, అగ్రవర్ణాలను ఆకర్షించేందుకు, దూరమైన అగ్రవర్ణాల పేదలను తమవైపు తిప్పుకునేందుకు ఉద్యోగాల్లో, విద్యారంగంలో పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకుద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఉల్లిపాయల రైతులకు పదిశాతం రాయితీలు ప్రకటించడం ద్వారా ఇంతవరకు రైతుల్లో పేరుకుపోయిన వ్యతిరేకతలో తగ్గుదల కనిపిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ రాయితీల వరదలో నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత కొట్టుకుపోతుందా అన్నది అనుమానమే. సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలు, శాశ్వత పరిష్కారాలు చూడకుండా తాత్కాలిక పరిష్కారాల వల్ల ప్రయోజనమేమాత్రం ఉంటుందనేది సందేహాస్పదమే. 2014లో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో రాజకీయంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా ఎదురైన తీవ్ర వ్యతిరేకతల కారణంగా దాదాపు 18 రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. కోలుకోలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్‌కు మళ్లీ జవజీవాలను, సత్తువను బీజేపీనే సమకూర్చిపెట్టింది. ఫలితంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కృషి ఫలితంగా బీజేపీకి బలమైన మూడు రాష్ట్రాల్లో ఉనికిని చాటుకుంటూ అధికారపీఠాన్ని అధిరోహించగలిగింది. కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోవడానికి మాయావతి విముఖం చూపి విడిగా పోటీచేసినా ఆ ప్రభావం కాంగ్రెస్ విజయాన్ని నిలువరించలేకపోయింది.

ప్రతి అంశంలోనూ చర్యలు చేపట్టేందుకు, కార్యకలాపాలను నిర్వహించేందుకు కొన్ని హద్దులుంటాయి. పలుమార్లు లక్ష్మణరేఖ దాటిన ఫలితమే నేడు బీజేపీకి ఎదురవుతోంది. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క అంశం బీజేపీకి ప్రజలను దూరంచేసింది. తమను వ్యతిరేకించే వారెవరికీ రాజకీయంగాగానీ, ప్రాంతీయంగా గానీ ఉండేందుకు అనర్హులనే విధానం అనుసరించడం, ఆ కోవలో ఉన్నవారంతా దేశద్రోహులని, జాతిద్రోహులని ముద్ర వేయించేందుకు చేసిన ప్రయత్నాలు, మేధోపరమైన ఆలోచనలు కలిగివున్న వారిని అంతమొందించే కార్యకలాపాలకు ఒత్తాసు పలకడం, అలాంటి వారిని వెలివేసేందుకు కూడా వెనకాడకుండడం, మైనారిటీలు, దళితులపై దాడులు... ఇలా ఒక్కటేమిటి ప్రతి అంశంలోనూ హిందూత్వ భావజాలాన్ని నింపేందుకు ప్రయత్నించడం ద్వారా ఆ పార్టీకి అన్నీ స్వయంకృతాపరాధాలే నష్టదాయకంగా పరిణమించాయని అద్దంలో ప్రతిబింబంలా కనిపిస్తున్నాయి. అలాగే, రాజకీయ చిత్రపటంలో తామొక్కరమే కనిపించాలన్న అత్యాశతో ఆయా ప్రాంతీయ పార్టీలను మింగేసేందుకు చేసిన యత్నాలు కూడా బెడిసికొట్టడంతో బీజేపీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో శృంగభంగం తప్పలేదు.

తమకు ఎదురైన చేదు అనుభవాలను ప్రజలు అంత తేలిగ్గా మరిచిపోతారనినుకుంటే ఎవరైనా భ్రమపడుతున్నట్టుగానే భావించాలి. కీలెరిగి వాతపెట్టేందుకు ప్రజలెప్పుడై కాసుక్కూర్చుంటారని ఈ 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక ఉదాహరణలు కళ్లెదుట కనిపిస్తాయి. ఒకప్పుడు తిరుగులేని ప్రజాభిమానాన్ని పొందిన ఇందిరా గాంధీనే తిరస్కరించిన ఉదంతం విస్మరించరాదు. ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు హక్కు ఉందని మరిచి ప్రవర్తించే రాజకీయ పార్టీని ఎలా శిక్షించాలో ప్రజలకు తెలియంది కాదు. ఒక్కొక్కరికి ఒక్కో విధమైన అనుభవం ఎదురవుతుంది. ఈసారి ఎన్నికల్లో బీజేపీకి అధికారం దూరమవుతుందా లేక ప్రజలు పెద్ద మనసు చేసుకుని క్షమిస్తారా అన్నది తేలేందుకు ఆట్టే సమయం లేదన్నది యదార్థమే కదా! ఒకవేళ పాలకపక్షంలో నిజంగా పరివర్తన కలిగి పశ్చాత్తాపం ప్రకటిస్తే రాజకీయంగా ప్రతిఫలం లభిస్తుందా అన్నది తేలాల్సిన విషయం.



ఆధ్యాత్మిక మార్గదర్శి

'ఆధునిక యువతపై నాకు విశ్వాసం ఉంది... నేను నిర్మించిన ఆదర్శాన్ని దేశమంతా వ్యాప్తి చేసేది వారే, అలాంటి యువత ముందు బలిష్టంగానూ, జవ సంపన్నులుగానూ, ఆత్మ విశ్వాసులుగానూ, ఋజు వర్తనులుగానూ మారాలి. ఇలాంటి యువత వంద మంది ఉన్నా చాలు, ఈ ప్రపంచాన్నే మార్చేయవ'చ్చని యువశక్తిని కొనియాడి, భవిష్యత్తు తరాలకు ఓ మార్గదర్శిగా నిలిచిన స్వామి వివేకానంద జయంతి నేడు. వివేకానందుడి సందేశాలు సూటిగా యువత హృదయాన్ని తాకుతాయి. యువశక్తి తలచుకుంటే సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదని వివేకానందుడు పేర్కొన్నాడు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనసులో ఉన్న యువత ఈ దేశానికి కావాలని వివేకానందుడు కోరుకున్నాడు. 'వివేకానందుడు ఎట్టి ఘనకార్యాలు చేశాడో చెప్పగలిగింది మరొక వివేకానందుడు మాత్రమే' అని స్వామిజీ ప్రగాఢమైన నమ్మకం. ఈయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటున్నాం. భవిష్యత్తు తరాలకు ఆయన ఓ మార్గదర్శి. 1863 జనవరి 12 మకర సంక్రాంతి పర్వదినాన దత్తవంశం మేధస్సుతో, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తాలోని సిమ్లా అనే పేటలో విశ్వనాథ దత్తా, భువనేశ్వరీ దేవీ దంపతులకు భారత

> **నేటి యువతకు ఆయన ఇచ్చిన సందేశం సరిగ్గా సరిపోతుంది. వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తే ఎన్నో సమస్యలు మటుమాయం అవుతాయి. ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్ని నాశనం చేస్తుంది. జీవితంలో ధనం కోల్పోతే కొంత కోల్పోయినట్టు కానీ వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్టే. ఏ పరిస్థితులలో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరుగుతాయి. ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం, ఇది విజయాన్ని కాంక్షించే వారి ప్రాథమిక లక్షణాలు.**

జాతికి ఆశాజ్యోతిగా వివేకానంద జన్మించాడు. వీరేశ్వరుడు అను నామకరణం చేసి నరేన్, బిలే అని ముద్దుగా పిలిచేవారు. వివేకానందునిగా మార్పు చెందే వరకు 'నరేంద్రనాథ్ దత్తా'గా ఖ్యాతిగాంచాడు.

వివేకానందుడు యవ్వనంలోకి అడుగుపెట్టగానే పాశ్చాత్య పుస్తకాలతో తృప్తి పడక, ప్రామాణిక గ్రంథాలు చదివేవాడు. వివాహ ప్రస్తావన వస్తే 'నేను బ్రహ్మచర్య జీవితం గురించి చాలా ఆలోచించాను. కాలాన్ని ఎదిరించి నిలబడే బ్రహ్మచారి ఘనతే ఘనత. అందరివలే ఐశ్వర్య భోగాలకు పాకులాడక శాశ్వతానంద ప్రాప్తికోసం యత్నిస్తాను' అని సన్యాస జీవితంలో కల గొప్పదనాన్ని వివరించి, సన్యాస జీవితంపై తనకు గల అనురక్తిని వ్యక్తం చేశా డు. తరువాత నరేంద్రుడు సన్యాసం స్వీకరించి వివేకానందుడిగా మారాడు. భారతదేశం అతని గృహమైంది. ఇక్కడి ప్రజలు అతడికి సోదర, సోదరీమణులయ్యారు. దురదృష్టవంతులైన తన సోదరుల కన్నీళ్ళు తుడవడం అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించే పని. దేశమంతా పర్యటించాడు. తనకున్న ఆస్తి అంతా ఒక కాషాయ వస్త్రం, ఒక కమండలం, శిష్యగణం మాత్రమే. ఈ పర్యటనలో అతను ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. దారి మధ్యలో గుడిసెల్లోనూ, సత్రాలలోనూ నివసించేవాడు, కటిక నేల మీదనే నిద్రించేవాడు. అనేకమంది సాధువుల సాంగత్యంలో గడిపాడు. ఆధ్యాత్మిక చర్చలతో, పవిత్ర కార్యాల గురించిన చర్చలతో సమయం గడిపేవాడు. చాలాదూరం కాలినడకనే నడిచేవాడు. ఎవరైనా దయ తలిస్తే ఏదైనా వాహనంలో ఎక్కేవాడు.

సెప్టెంబర్ 11న స్వామీ వివేకానంద విశ్వవిఖ్యాత చికాగో ఉపన్యాసానికి 125 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఆయన తన ఉపన్యాసంలో భారతదేశపు ఏకాత్మ, జీవన దృష్టి ఆధారంగా విశ్వమంతా ఒక కుటుంబం అనే భావాన్ని అందరి ముందు ఉంచారు. అది కేవలం సిద్ధాంతపరమైన భావన కాదు. అది ఆయన సంపూర్ణంగా విశ్వసించిన, ఆయన హృదయం నుండి వచ్చిన విషయం. చికాగో ఉపన్యాసాన్ని 'నా అమెరికా సోదర సోదరిమణులారా...' అనే సంబోధనతో ఆయన ప్రారంభించినప్పుడు సభికులంతా ఒక్కసారిగా ఉత్తేజితులయ్యారు. లేచి నిలబడి కొన్ని నిముషాలపాటు వారు చేసిన కరతాళధ్వనులకు సభాగృహం మారుమోగిపోయింది.

స్వామీ వివేకానంద తన ఉపన్యాసంలో 'ఏ ధర్మమైతే ప్రపంచానికి గౌరవించడం నేర్పిందో ఆ ధర్మానికి చెందినవాడిగా నేను గర్విస్తాను. అన్ని మతాలు సత్యమని మేము అంగీకరిస్తా'మని చెప్పారు. స్వామీజీ ఇంకా ఇలా అన్నారు 'మతతత్వం, పిడివాదం, వాటి భయంకరమైన వారసత్వం ఈ సుందరమైన భూమిపై చాలాకాలం రాజ్యం చేశాయి. అవి ఈ భూమిని హింసతో నింపేశాయి. మానవుల రక్తంతో తడిపేశాయి. సభ్యత సంస్కారాలను నాశనం చేశాయి. దేశం మొత్తాన్ని నైరాశ్యంలో ముంచేశాయి. ఈ భయంకరమైన దహనకాండ లేకపోతే మానవ సమాజం ఇప్పటికి ఎంతో అభివృద్ధి చెందే'దని అన్నారు. స్వామీజీ కృషి వల్ల ఒక్క అమెరికాలోనే కాకుండా అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ భారతదేశం పట్ల గౌరవం ఏర్పడింది. ఆయన ఎక్కడ ఉపన్యాసం ఇవ్వడానికి వెళ్ళినా జనం గుమికూడి ఎంతో ఓపికగా ఎదురుచూసేవారు. ఉపన్యాసం అయిపోయిన తరువాత ఆయన్ని తమ ఇళ్ళకు ఆహ్వానించి ఆదరించేవారు. ఇంగ్లాండు నుంచి కూడా ఆయనకు ఆహ్వానం లభించింది. ఆయనకు అక్కడ ఘనస్వాగతం లభించింది. వార్తాపత్రికలు ఆయనను ఘనతను, వాగ్ధాటిని శ్లాఘించాయి. ఎంతోమంది ఆయనకు శిష్యులయ్యారు. వారిలో ముఖ్యులు సిస్టర్ నివేదితగా మార్పు చెందిన మార్గరెట్ నోబుల్. తరువాత ఆమె భారతదేశానికి వచ్చి ఇక్కడే ఉండిపోయారు.

నాలుగు సంవత్సరాల పాటు విదేశీ పర్యటన తరువాత స్వామీజీ తిరిగి భారతదేశానికి విచ్చేశాడు. ఆయన తిరిగి వచ్చేసరికి ఆయన కీర్తి దశదిశలా వ్యాపించిపోయింది. ఎక్కడికి వెళ్ళినా తమ గురువు చెప్పిన సందేశాన్ని వ్యాప్తి చేశాడు. ఆయన దగ్గరకు మార్గదర్శకత్వం కోసం వచ్చేవారికి ఆధ్యాత్మిక విలువల ప్రాధాన్యాన్ని బోధించేవాడు. అదే స్ఫూర్తితో, లక్ష్యంతో 1897లో రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. తరువాత రెండు సంవత్సరాలలో గంగానది ఒడ్డున గల బేలూర్ వద్ద స్థలాన్ని కొని మఠం కోసం భవనాల్ని నిర్మించాడు. ఈ మఠం తరువాత శాఖోపశాఖలుగా విస్తరించింది. 'వ్యక్తి మోక్షానికి, ప్రపంచ హితానికి' అనే నినాదం మీద రామకృష్ణా మఠాన్ని స్థాపించాడు. అవిశ్రాంతంగా పనిచేయడం వలన స్వామి ఆరోగ్యం దెబ్బతిన్నది. జులై 4, 1902న యథావిధిగా ఆయన రోజూవారీ కార్యక్రమాలు నిర్వర్తించుకున్నాడు. దీర్ఘంగా శ్వాస పీల్చి నెమ్మదిగా శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. ఆయన శిష్యులు తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలవలే దు:ఖించారు.

నేటి యువతకు ఆయన ఇచ్చిన సందేశం సరిగ్గా సరిపోతుంది. వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తే ఎన్నో సమస్యలు మటుమాయం అవుతాయి

ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్ని నాశనం చేస్తుంది.

జీవితంలో ధనం కోల్పోతే కొంత కోల్పోయినట్టు కానీ వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్టే.

ఏ పరిస్థితులలో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరుగుతాయి.

ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం, ఇది విజయాన్ని కాంక్షించే వారి ప్రాథమిక లక్షణాలు.

◆ కాళంరాజు వేణుగోపాల్
8106204412



అమోఘమైన వాక్పటిమ

వివేకానంద (జనవరి 12, 1863 – కలకత్తాలో జన్మించాడు. బాల నరేంద్రగా ప్రసిద్ధి గాంచిన హిందూయోగి. ఇతని పూర్వ నామం నరేంద్రనాథ్ దత్తా. రామకృష్ణ పరమహంస ప్రియశిష్యుడు. వేదాంత, యోగతత్త్వ శాస్త్రాల్లో సమాజంపై అత్యంత ప్రభావం కలిగించిన ఒక ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడు. హిందూతత్వ చరిత్ర, భారతదేశ చరిత్రలలోనే ఒక ప్రముఖ వ్యక్తి. రామకృష్ణ మఠం వ్యవస్థాపకుడు.

వివేకానంద భారతదేశానికీ, హిందూ మతానికి ప్రాతినిధ్యం వహిస్తూ 1893 సెప్టెంబరు 11న చికాగోలో మొదటి ప్రపంచ మత సమ్మేళనంలో చేసిన ప్రసంగం సుప్రసిద్ధమైనది. స్వామీ వివేకానంద 1893 ప్రపంచ మత సమ్మేళనానికి భారత దేశానికీ, హిందూమతానికి ప్రాతినిధ్యం వహించారు. 11 నుంచి 1893 సెప్టెంబరు 27లో నిర్వహించిన ఆ సమ్మేళనం మొదటి ప్రపంచ మత సమ్మేళనం. ప్రపంచవ్యాప్తంగా పలు మతాల ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. వివేకానంద చేసిన ఈ చరిత్రాత్మక ప్రసంగంలో ప్రియమైన అమెరికా సోదర సోదరీమణులారా (మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా) అని సంబోధిస్తూ ప్రారంభించడంతోనే శ్రోతలను ఆకట్టుకున్నారు. సాధారణంగా లేడీస్ అండ్ జంటిల్మన్ అన్న సంబోధనకు అలవాటుపడ్డ వారిని, ఈ పిలుపులోని ఆత్మీయత ఆకర్షించింది. ఆయన సందేశానికి, వాక్పటిమకూ, నిజాయితీతో కూడిన సంభాషణకు అక్కడి ప్రతినిధులు ఆకర్షితులయ్యారు. అమెరికన్ పత్రికలు సైతం వివేకానందుని వ్యక్తిత్వం, సందేశాన్ని ప్రశంసించాయి.

భారతదేశాన్ని జాగృతం చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రాలను తన ఉపన్యాసాల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి అతనికి ఉంది. గురువుగారి కోరిక మేరకు అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేశాడు. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశంమళ్లీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. ఆయన వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతోమంది అతనికి శిష్యులయ్యారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి ఈయనే. తూర్పు దేశాల తత్త్వాన్ని షికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభ (పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రెలిజియన్స్)లో 1893లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలోను, అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు.ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించాడు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని ''జాతీయ యువజన దినోత్సవం''గా 1984లో ప్రకటించింది

◆ కమ్మరి శ్రీనివాసచారి
9177324124

(నేడు జాతీయ యువజన దినోత్సవం)

మంచిమాట



కాలి కింద ఉంది కదా అని.. ధూళిని చులకనగా చూడకు.. 'కళ్లలో' పడినప్పుడే తెలుస్తుంది.. దాని సత్తా ఏంటో...!

- స్వామి వివేకానంద

పొగ మత్తుతో లక్ష్యం చిత్తు

మనిషి దశలలో చాలా ప్రముఖమైనది యుక్తవయస్సు. యుక్తవయసులో కలిగే అనుభవాలు మనిషి జీవితాంతం వెన్నంటే ఉంటాయి. ఉన్నత స్థితికి ఎదగాలంటే యుక్తవయసులో తీసుకునే నిర్ణయాలు ప్రధానమైనవి. మధుర స్మృతులు కావచ్చు లేదా మచ్చగా మిగిలే గాయాలు కావచ్చు. బంగారం లాంటి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యువత ఒక్కొక్క అడుగు వేయాలి. యుక్తవయసులోనే శారీరక, మానసిక పరిపక్వత అభివృద్ధి చెందుతాయి. ఈ వయస్సులో కొత్త అంశాలను కనుగొనడానికి, శోధించడానికి ప్రయత్నాలు చేయడంలో అత్యుత్సాహన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఇటీవల యువత కొత్త పుంతలు తొక్కుతోంది. స్మార్ట్ ఫోన్ వినియోగంతో మంచికంటే ఎక్కువ చెడుకే సులభంగా, తొందరగా ప్రభావితమవుతున్నారు. ప్రస్తుతం సరదాగా యువత చేసుకుంటున్న స్మోకింగ్ (ధూమపానం) అలవాటే జీవితాంతం కొనసాగే చెడు అలవాటుగా మారుతోంది. ఇది వ్యసనంగా మారి క్రమంగా ప్రాణాల మీదికి తెస్తోంది. ధూమపానం చేసేవారి యువత సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. ధూమపానంతో వచ్చే వ్యాధులను తగ్గించుకునేందుకు వందల రెట్ల రూపాయలు అధికంగా ఖర్చు పెట్టినా పొగాకు పదార్థాల ప్యాకెట్లపై తేలుబొమ్మ, కాన్సర్ రోగిబొమ్మను ముద్రించినా, సిగరెట్ ధర ఎంత పెంచినా, బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేధించినా, చెల్లించక తప్పదు భారీ మూల్యం, ధూమపానం ప్రాణాంతకం అని తెలిసినా సిగరెట్ అమ్మకాలు, పొగాకు ప్రియుల సంఖ్య మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ ప్రస్తుతం యువతలో విపరీతంగా పెరిగిపోతోంది. తమ ఆరోగ్యాన్ని తమే పాడుచేసుకుంటున్నామన్నా సోయి మరిచిపోయి, పొగను రింగులు రింగులుగా వదులుతూ, విలాసంగా సిగరెట్ కాలుస్తున్నానన్న భ్రమలో తేలియాడుతూ యువత తమ జీవితాన్ని చేజేతులా బూడిదచేసుకుంటున్నారు. ధూమపానం వల్ల వ్యక్తులలో నోటి కాన్సర్, దంతవ్యాధులు, ఉపిరితిత్తుల క్యాన్సర్, ఉదరకోశ వ్యాధులు, అల్సర్, గ్యాస్ట్రబుల్ సోకే అవకాశాలు ఎక్కువ. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ కారణంగా పిల్లల్లో ఆస్తమా రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. గుండెకు సంబంధించిన రక్త నాళాలు దెబ్బతిని రక్తపోటు, గుండెపోటు సంభవిస్తాయి. మెదడులోని రక్తనాళాలు చిట్లి పక్షవాతం, నరాల బలహీనత ఏర్పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో వినికిడి, మాట్లాడే సమస్యలు తలెత్తుతాయి. ధూమపానం చేసేవారిండ్లలో ఉన్న పిల్లలకు ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి.

పొగతాగడం మానేయాలనే ఆలోచన వచ్చినా అమలులో మాత్రం సాధ్యం కావడం లేదనే వారు ఎక్కువయ్యారు. ఒక చెడు మొక్కను నిర్మూలించాలని ఆకులు, కొమ్మలు, కాండాలను నరికి వేసినంత మాత్రానా చెడు మొక్క పూర్తిగా నశించదు. మరలా కొద్ది రోజులకు మళ్లీ మొలకెత్తుతుందనే విషయం మనకందరికీ తెలుసు. ఆ చెడు మొక్కను వేర్లతో సహా, నామరూపాలు లేకుండా పెకిలి వేసినపుడు మాత్రమే సాధ్యమవుతుంది. పొగతాగడం మానేయాలనుకోవడం మంచి నిర్ణయమే. పొగతాగడం మానేయాలనే ఆలోచనను ఆచరణలో పెట్టాలంటే మాత్రం తప్పకుండా ప్రణాళిక రూపొందించుకోవాలి. పొగ తాగే వ్యసనపరులందరికీ ఒకే రకమైన నియమాలు పనిచేయవనే విషయాన్ని ముందుగా గుర్తించడం మంచిది. పొగతాగడాన్ని ఎందుకు మానేయాలనుకుంటున్నారో మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవాలి. మీ బలాలు, బలహీనతలను తెలుసుకోండి. సిగరెట్ తాగడానికి మిమ్మల్ని ఏ పరిస్థితులు ప్రేరేపిస్తున్నాయో గమనించండి. సిగరెట్లు మానేయడం సులువే. పొగతాగడం మానివేసే సమయంలో ఉత్పన్నమయ్యే అసహనం, ఆందోళన వంటి లక్షణాలు అగుపిస్తాయి. వీటిని దృఢసంకల్పంతో, ధీమాగా ఎదుర్కొవాలి.

డ్యూక్ యూనివర్సిటీ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ధూమపానం చేసే ముందు ఒక గ్లాసు పాలు తాగడం మూలంగా సిగరెట్ రుచి పట్ల ఆసక్తి ఉండదు. సిగరెట్ ఆలోచన మనసుకు రాగానే, ముందుగా గ్లాసుపాలు తాగితే మంచి ఫలితముంటుంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగితే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఒక అధ్యయనంలో వెల్లడైంది. నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం రోజులో కనీసం 35 మిల్లీగ్రాముల విటమిన్-సి తీసుకోవాలి. అయితే పొగాకు తినేవారిలో వచ్చే విటమిన్-సి లోపం కారణంగా గుండె జబ్బులు, కేన్సర్ బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారపదార్థాలు తీసుకుంటే పొగాకు వ్యసనం నుంచి బయటపడవచ్చు. విటమిన్ ఇ ఎక్కువగా తీసుకుంటే ధూమపానం వలన వచ్చే అనారోగ్య సమస్యలను నివారించవచ్చు.

తల్లిదండ్రులకు సిగరెట్ కాల్చడం ఒక అలవాటుగా ఉన్నట్లయితే యుక్తవయస్సులోని పిల్లలు కూడా అలవాటుగా చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులుగా బాధ్యత తీసుకొని పిల్లల బంగారు భవిష్యత్తు కోసం



సాధ్యమైనంత త్వరగా పొగతాగే అలవాటు మానుకోవాలి. ధూమపానం నిర్మూలన దిశగా కఠినమైన నిబంధనలను, నియమాలను నిర్దేశిస్తూ, చిన్న వయస్సులోనే ధూమపానానికి అలవాటు పడటం మంచిది కాదని పిల్లలను హెచ్చరిస్తూ ఉండాలి. యుక్తవయసు పిల్లలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ వారితో మాట్లాడుతూ వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలి. యుక్తవయసులో కొత్త అంశాల వైపుగా మొగ్గు చూపుతూ వాటి ఆకర్షణకు లోనవుతూ ఉంటారు. యువత ధూమపానం అలవాటును దూరం చేసుకోవడానికి సైకాలజిస్ట్ ద్వారా కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది. లక్ష్యం వైపుగా పయనించడానికి కౌన్సెలింగ్ ద్వారా సాధించడం సులువవుతుంది.

◆ డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్
9703935321

జ్ఞాన భాస్కరా... వివేకా

అంతులేని కరుణతో మాధవునిపై
జీవుడే దేవుడన్న గురుబోధనే మంత్రమై పఠించి
ప్రతి జీవిలో పరమాత్మని దర్శించి
తత్వజ్ఞాన శోభతో సద్గురువై
సర్వమత సామరస్యం ఆశయమై సాగాలని చాటి చెప్పి
మూఢత్వం, జడత్వం వీడాలంటూ ఎలుగెత్తి చాటి
ప్రేమ సందేశమే శాంతి సందేశమని తెల్పి
'వ్యక్తి మోక్షం ప్రపంచ హితం' నినాదమై
గురుసందేశం నలుదిశలా వ్యాప్తిచేసి
జీవితమంటే అనుభవాల క్రమమని
అనుభవమే గురువని బోధించి
కారుచీకట్లలో చిరుదివ్వెవై నిలిచి
భారతీయ ఆధ్యాత్మిక వారసత్వమై
భరతజాతి గొప్పదనమై చైతన్యశంఖం పూరించి
గాఢ నిద్రలో ఉన్న భరతజాతిని మేల్కొలిపి
విదేశీగడ్డపై ఒదిగి ఎదిగి విశ్వమత సభలో వేదాంతభేరి
మోగించి / సత్యశోధకుడవై, వివేకుడవై
భరతఖ్యాతి దశదిశలా వ్యాప్తిచేసిన
జ్ఞానసూరీడా... ఓ వివేకుడా
మీ బోధనలు మాకు అనుసరణీయం
అందుకే ఓ నరేంద్రుడా! జాతి మరువదు నిన్ను
ఎన్నేళ్లయినా... ఎన్నియుగాలైనా

- వేమూరి శ్రీనివాస్, 9912128967

మాల్స్‌లో కవర్ల పేరిట దోపిడీ

సాధారణంగా చిన్నచిన్న పట్టణాలలో, గ్రామాలలో, రోడ్ల పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు తమ దగ్గర కనీసంగా రూపాయి వస్తువు కొన్నా, ఎంచక్కా ఒక కాగితం కవర్లో కొన్న వస్తువును పెట్టి అంతే మర్యాదగా వినియోగదారులకు ఇస్తారు. కానీ పెద్దపెద్ద పట్టణాలలో వస్త్ర వ్యాపారం చేసే షాపింగ్ మాల్స్, నిత్యావసర సరుకులు అమ్మే కార్పొరేట్ అమ్మకందార్లు, అలాగే ఐమాక్స్, ఐనాక్స్ లాంటి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో వివిధ రకాల వస్తువులు అమ్మే బహుళజాతి కంపెనీల మాల్స్‌లో కొనుగోలు చేసే వినియోగదారులు పొరపాటు న కొన్న వస్తువుల వేసుకునేందుకు ఒక బ్యాగో, ఒక కవ రో తీసుకొని వెళ్లకపోతే ఆయా షాపింగ్ మాల్స్‌లో ఐదు నుండి పది రూపాయల వరకు కవర్ కోసమో బ్యాగు కోసమో ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రపంచీకరణలో భాగంగా విచ్చలవిడిగా వ్యాపారాలు చేసుకునే అవకాశాన్ని ఈ బహుళజాతి కంపెనీలకు మన ప్రభుత్వాలు కట్టబెట్టిన కారణంగా ఎక్కువశాతం వినియోగదారులు ఈ బహుళ జాతి కంపెనీల షాపింగ్ మాల్స్ ప్రచారాలకు ఆకర్షింపబడి వీరి వద్దనే ఎక్కువగా అనేక రకాల వస్తువులను కొనుగోలు చేపట్టే పరిస్థితి దాపురించింది. సంవత్సరం పొడవునా ఆయా మాల్స్‌లో జరిగే వ్యాపారం వేల కోట్ల రూపాయలలో ఉంటుంది. ముఖ్యంగా పండగ సమయాల్లో, పెళ్లిళ్ల సమయాల్లో వ్యాపారం మరీ ఎక్కువగా ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఇటువంటి బహుళజాతి కంపెనీల షాపింగ్ మాల్స్‌లో ఏడాదికి వందల, వేల కోట్లలో జరిగే వ్యాపారంలో లక్షల్లో, కోట్ల లో వినియోగదారులు వివిధరకాల వస్తువులను కొను గోలు చేస్తుంటారు. ఈ కవర్ల, బ్యాగుల రూపంలో కోట్ల లో వీరికి ఆదాయం ఇట్టే వస్తుంటుంది. తమకు వచ్చిన ఈ బయటకు కనబడని ఆదాయంలో ఒక్క పైసా కూడా వదులుకోవడానికి ఇష్టపడని వాళ్ళు, ఈ బహుళజాతి కంపెనీ మాల్స్ నిర్వాహకులు. వినియోగదారుడు మన దగ్గర వేలల్లో ఖర్చుపెట్టి వస్తువులను కొనుగోలు చేస్తున్నాడు కదా! వీళ్ల కోసం ఒక కవరో, ఒక బ్యాగో ఇవ్వాలి. అనే కనీస ఇంగిత జ్ఞానం లేకపోవడం చాలా బాధాకరం. 'ఉదారత' అనే గుణానికి వీళ్ళు ఆమడ దూరంలో ఉండటం గమనార్హం. అలాంటి వీరి కోసం మన ప్రభుత్వాలు ఎర్రతివాచీలు, పచ్చ తివాచీలు పరిచి స్వాగతం పలకడం విడ్డూరం. ప్రజా శ్రేయస్సు అనే మాట ఏ కోశానా కూడా వీళ్ళకు లేకపోవడం బాధాకరమని సామాన్య ప్రజల అభిప్రాయ పడడంలో అర్థం ఉంది.

◆ పిల్లా తిరుపతి రావు, 7095184846



వారంతంలో నష్టాలు

వరుసగా రెండో రోజు పడిపోయిన సూచీలు

- ప్రారంభంలో లాభాలను నిలుపుకోలేకపోయిన సెనెక్స్, నిఫ్టీ
- ఎటకేలకు 36 స్టాయిని నిలుపుకున్నసెన్సెక్స్
- 10,800 మార్క్‌ను కాపాడుకోలేకపోయిన నిఫ్టీ
- ఐటీ, ఆటో రంగాల్లో అమ్మకాలతో తప్పని నష్టాలు
- మిశ్రమంగా ముగిసిన అంతర్జాతీయ సూచీలు





ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజు నష్టాల్లోనే ముగిసింది. లాభాల్లో ప్రారంభమైన బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు తర్వాత ఆ లాభాలను నిలుపుకోలేకపోయాయి. చివరకు సెన్సెక్స్ 97 పాయింట్ల నష్టంతో 36,009 వద్ద, నిఫ్టీ 26 పాయింట్ల నష్టంతో 10,794 వద్ద క్లోజయ్యాయి. నిఫ్టీ 10,800 స్థాయిని రక్షించుకోలేకపోయింది. సెన్సెక్స్ మాత్రం 36,000 స్థాయిని కాపాడుకుంది. సెన్సెక్స్ ఒకానొక సమయంలో 36,000 స్థాయి కిందకు పడిపోయింది. అయితే చివరకు నష్టాలను తగ్గించుకుంది. ఆసియా మార్కెట్ల లాభాల కారణంగా ఉదయం మన మార్కెట్ లాభాల్లోనే ప్రారంభమైంది. అయితే తర్వాత ఐటీ, ఆటో, బ్యాంక్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఇండెక్స్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి. నిఫ్టీ 50లో ఐటీసీ, యూపీఎల్, విప్రో, ఐఓసీ, హిందాల్కో, ఓఎన్‌జీసీ, ఏసియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, వేదాంత, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, టీసీఎస్, యస్ బ్యాంక్, గెయిల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్‌బీఐ షేర్లు పడిపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. భారతీ ఇన్‌ఫ్రాటెల్, టీసీఎస్ షేర్లు 2 శాతానికి పైగా పడిపోయాయి. ఐటీసీ, యూపీఎల్, విప్రో షేర్లు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో నిఫ్టీ 10,739 పాయింట్ల కనిష్ట స్థాయిని, 10,850 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఇక సెన్సెక్స్ 35,840- 36,214 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. సెక్టోరల్ ఇండెక్స్‌లు మిశ్రమంగా ముగిశాయి. నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ మినహా మిగతా ఇండెక్స్‌లన్నీ పడిపోయాయి. నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఆటో ఇండెక్స్‌లు ఎక్కువగా నష్టపోయాయి.



బిగ్ సి సంక్రాంతి ఆఫర్లు

న్యూఢిల్లీ: సంక్రాంతి పండుగ సందర్భంగా మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్ సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద బజాజ్ ఫినాన్స్ కార్డును ఉపయోగించి చేసిన ప్రతి కొనుగోలుపై 10 శాతం ప్రత్యేక డిస్కౌంట్‌ను ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ప్రతి కొగుగోలుపై రూ. 2,200ల జియో క్యాష్‌బ్యాక్, 30 జీబీ డాటను ఇవ్వనున్నట్లు బిగ్ సి ప్రతినిధి తెలిపారు. మరికొన్ని ఎంపిక చేసిన ఫోన్లపై ఒక సారి స్కీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా బిగ్ సి ప్రకటించింది. ఇక ప్రతీ కొనుగోలుపై కచ్చితమైన బహుమతిని ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రతి ఏడాది సంక్రాంతికి ఇలా ఆఫర్లు ప్రకటించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన అన్నారు. ఇక సంస్థలో శాంసంగ్, వివో, ఓప్పో వంటి మొబైల్‌లపై ప్రత్యేకమైన ఆఫర్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.



జాన్సన్ అండ్ జాన్సన్‌కు ఊరట

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్‌కు కోర్టులో ఊరట లభించింది. గత కొంత కాలంగా తమ ఉత్పత్తులో లోపాలున్నాయని చట్టపరమైన సవాళ్లను జాన్సన్ అండ్ జాన్సన్ ఎదుర్కొంటుంది. కాగా, ఇటీవల దీనిపై విచారణ జరిపిన కోర్టు శని వారం సంస్థకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ కేసులో బాధితులకు జాన్సస్ సంస్థ నుంచి పరిహారం ఇప్పించేలా చర్యలు చేపట్టినట్లు కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు ఈ కేసును మూసివేసింది. వివరాల్లోకి వెళితే..జాన్సన్ అండ్ జాన్సన్ అనుబంధ సంస్థ విక్రయించిన హిప్ ఇంప్లాంట్స్ సరిగా లేవని, ఈ ఇంప్లాంట్స్‌ను తమ శరీరంలో అమర్చుకున్న బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2005 నుంచి 4,500 మందికి పైగా రోగులకు జాన్సన్ సంస్థ విక్రయించిన ఈ ఇంప్లాంట్స్‌ను అమర్చారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో కేంద్ర ఆరోగ్య శాఖ అటు బాధితులతో.. ఇటు సంస్థతో పలు దఫాలుగా చర్చలు జరిపింది. చివరకు బాధితులకు నష్టపరిహారం ఇప్పించేలా ఏకాభిప్రాయానికి వచ్చింది. బాధితులకు రూ. 3లక్షల నుంచి రూ. 1.22కోట్ల వరకు పరిహారం ఇచ్చేలా సంస్థపై చర్యలు తీసుకున్నామని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ చర్యలపై సంత ప్తి వ్యక్తం చేసిన కోర్టు.. కేసును మూసివేసింది. అంతేగాక.. ఈ పరిహారం గురించి విస్త తంగా ప్రచారం చేయాలని, తద్వారా బాధితులందరికీ న్యాయం జరుగుతుందని కోర్టు పేర్కొంది.



ఈ-రెసిడెన్సీ ఆఫర్‌ను ప్రకటించిన ఎస్తోనియా



హైదరాబాద్: ఉన్నత విద్యా రంగంలో తెలంగాణ ప్రభుత్వంతో సహకార ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎస్తోనియా యోచిస్తున్నట్టు ఆ దేశ రాయబారి రిహోక్రుఫ్ తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ రంగాల్లో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నట్టు ఆయన తెలిపారు. ఇటీవల ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు దేశంలోనే ముఖ్యమైన ఐటీ హబ్‌గా ఎదిగినందున అపార అవకాశాలున్నాయని అన్నారు. ఎస్తోనియా ప్రారంభించిన ఈ-రెసిడెన్సీ ప్రోగ్రామ్ ద్వారా యూరోపియన్ యూనియన్ దేశాల్లో వ్యాపార కార్యకలాపాలను నిర్వహించుకునే వీలుంటుందని వెల్లడించారు. ఇప్పటికే 2,200 మందికిపైగా భారతీయులు 275 కంపెనీలు నెలకొల్పారని వెల్లడించారు. ముకేశ్ అంబానీ ఎస్తోనియాలో ఈ రెసిడెన్సీ ద్వారా కంపెనీని నెలకొల్పి జియో కోసం డిజిటల్, కమ్యూనికేషన్స్ రంగాలలో పనిచేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, దీపక్ సోలంకి వంటి ప్రముఖ ఇన్వెస్టర్లు కూడా ఎస్తోనియాలో కార్యాలయాలను తెరిచినట్టు తెలిపారు. కేవలం వంద యూరోలతో రిజిష్టర్ చేసుకోవడం ద్వారా డిజిటల్ ఈ-రెసిడెన్సీ కార్డు పొంది ఆ దేశ పౌరుల మాదిరిగానే అన్ని సదుపాయాలను పొందవచ్చునని వెల్లడించారు. సులభ పన్ను విధానాలు, అతి తక్కువ అవినీతి కలిగిన ఎస్తోనియాలో కార్యాలయాలను నెలకొల్పడం ద్వారా మొత్తం యూరోపియన్ దేశాలకు విస్తరించే వీలుంటుందని తెలిపారు. కేవలం గత ఏడాది కాలంలోనే 200 భారతీయ కంపెనీలు ఎస్తోనియాలో అడుగు పెట్టాయని చెప్పారు.

చిన స్టాక్‌లకు మంచి రోజులు



న్యూఢిల్లీ: గతేడాది పలువురు ఇన్వెస్టర్లకు చుక?్కలు చూపిన స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్ ఈ సంవత్సరం కోలుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత గణాంకాల ఆధారంగా చూస్తే ఒక ఏడాది పేలవ ప్రదర్శన అనంతరం తరువాత సంవత్సరం మంచి రాబడులను చిన్న స్టాకులు అందించినట్లు తెలుస్తోందన్నారు. ఉదాహరణకు 2013లో మిడ్, స్మాల్‌క్యాప్స్ సూచీలు వరుసగా 6, 11 శాతం మేర నష్టపోయాయి. ఆ ఏడాది ప్రధాన సూచీలు 9 శాతం లాభపడ్డాయి. 2014 పూర్తయ్యేసరికి మిడ్‌క్యాప్ సూచీ 54.7 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 69.2 శాతం దూసుకుపోయాయి. ఇదే సమయంలో ?ప్రధాన సూచీలు కేవలం 30 శాతం మాత్రమే లాభపడ్డాయి. 2102లో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 36, 38 శాతం లాభాలు నమోదు చేశాయి. ఆ ఏడాది సెన్సెక్స్ 26 శాతం ముందంజ వేసింది. 2011లో మిడ్‌క్యాప్ సూచీ 34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 43 శాతం క్షీణించాయి. గత 13సంవత్సరాల్లో ఒక ఏడాది బాగుంటే మరో ఏడాది పనతం కావడం తిరిగి మరుసటి ఏడాది దూసుకుపోవడమనేది చిన్న స్టాకులకు అలవాటుగా మారింది. కేవలం 2010, 2011లో మాత్రం వరుసగా రెండేళ్లపాటు మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పుష్కరకాలంలో 2009 చిన్న స్టాకులకు అత్యద్భుతంగా కలిసివచ్చింది. ఆ ఏడాది స్మాల్‌క్యాప్ సూచీ 127 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 180 శాతం దూసుకుపోయాయి. ఆ ఏడాది ప్రధాన సూచీలు దాదాపు 81 శాతం లాభపడ్డాయి. 2008 సుదీర్ఘ పతనానంతరం 2009లో సూచీలు బలంగా బౌన్సయ్యాయి. ఈ దఫా కూడా ఇదే ధోరణి రిపీటవుతుందని చాలామంది అనలిస్టులు భావిస్తున్నారు. అయితే 2013లో మిడ్‌క్యాప్ సూచీ పీఈ 4 వద్ద ఉందని, దాంతో ఎక్కువ ఎంఎ ఫ్‌లు ఇబ్బడిముబ్బడిగా చిన్నస్టాకులను కొన్నాయని, ఈ సారి వాల్యూషన్లు మరీ అంత చౌకగా ఏమీ లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇంత కరెక్షన్ వచ్చినా మిడ్‌క్యాప్స్ ఇంకా చీప్‌జోన్‌లోకి రాలేదని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ భావిస్తోంది. గతేడాది మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు దాదాపు 20 శాతానికి పైగా పతనమయ్యాయి. అయితే వీటిలో చాలా స్టాకుల వాల్యూషన్లు దిగివచ్చాయని ఇతర బ్రోకరేజ్‌లు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బాలెన్స్‌డ్ పోర్టుఫోలియో ఏర్పాటు చేసుకొని నాణ్యమైన చిన్నస్టాకులకు పోర్టుఫోలియోలో 40 శాతం వరకు వెయిటేజ్ ఇవ్వడం మేలని అధికుల సూచన.

తెలుగు రాష్ట్రాలకు లివ్ ఫాస్ట్



హైదరాబాద్, (మనం బిజినెస్ ప్రతినిధి): పవర్ బ్యాకప్ సొల్యూషన్స్‌లో విస్తృత శ్రేణి పోర్ట్‌ఫోలియో, భారత్‌లో అగ్రగామి సంస్థలో ఒకటైన లివ్ ఫాస్ట్ సంస్థ బ్యాటరీ, ఇన్వర్టర్ ఉత్పత్తుల రంగాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు విస్తరించింది. శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో లివ్ ఫాస్ట్ సంస్థ సీఈఓ గురుప్రీత్ భాటియా అధికారికంగా ప్రకటించారు. శనివారం నుంచి తమ ఉత్పత్తులు రెండు తెలుగు రాష్ట్రాల మార్కెట్లలో అందుబాటులో ఉండనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్ఏఆర్ గ్రూపునకు చెందిన లివ్ ఫాస్ట్ ప్రధానంగా వాహనాల బ్యాటరీలు, ఇన్వర్టర్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు సోలార్ అప్లికేషన్స్ వంటి విభాగాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన ఈ కంపెనీ 2015లో అటోమోటివ్ రంగానికి విస్తరించింది. కాగా, బ్యాటరీ విభాగాలకు 2016లో ప్రవేశించిన లివ్ ఫాస్ట్ గత నెలలో దక్షిణాదిన కర్ణాటకలో ప్రవేశించింది. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో తన ఉనికి విస్తరించుకుంది. రూ. 1,000 కోట్ల విలువ కలిగిన కంపెనీ కేవలం గృహ బ్యాటరీల విభాగానికే రూ. 250 కోట్లను వెచ్చించినట్లు సీఈఓ గురుప్రీత్ పేర్కొన్నారు. కాగా, బ్యాటరీల ఉత్పత్తికి గాను హిమాచల్, బద్ది ప్రాంతాల్లో ప్లాంటు ఉన్నాయని తెలిపారు. వీటి సామర్థ్యం ఏడాదికి 18 లక్షల యూనిట్లుగా ఆయన పేర్కొన్నారు. కాగా, దేశంలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలను దృష్టిలో ఉంచుకుని ద్విచక్రవాహనాలు, ఈ-రిక్షాలపై దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 12 నుంచి 15 శాతం వృద్ధిని నమోదు చేస్తామని ఆయన ఆశించారు. ఈ విభాగానికి ప్రముఖ క్రికెటర్ ఎం.ఎస్. ధోనీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.




బంధన్ బ్యాంకుకు పెరిగిన లాభాలు

- 10 శాతం వృద్ధితో రూ. 300 కోట్ల నికర లాభం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 10 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ. 300 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.331 కోట్లకు ఎగసిందని బంధన్ బ్యాంక్ తెలిపింది. ఈ బ్యాంక్ నికర లాభంపై కూడా ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూప్ రుణ భారం ప్రభావం చూపించింది. ఈ సంస్థకు ఇచ్చిన రుణాలకు ఈ బ్యాంక్ పూర్తిగా కేటాయింపులు జరపాల్సి వచ్చింది. ఈ కేటాయింపులు లేకపోతే, నికర లాభం మరింతగా పెరిగి ఉండేది. కాగా ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కు ఏ మాత్రం రుణాలిచ్చిందనేది ఈ బ్యాంక్ వెల్లడించలేదు. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ రుణాల పుణ్యమాని ఈ బ్యాంక్ మొండి బకాయిలు భారీగా పెరిగాయి. గత క్యూ3లో రూ. 1,336 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 41 శాతం వ ద్ధితో రూ.1,884 కోట్లకు ఎగసిందని బ్యాంక్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు. రుణాలు 46 శాతం వ ద్ధి చెంది రూ.35,599 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. రుణ వ ద్ధి జోరుగా ఉండటం, మార్జిన్లు పటిష్టంగా(10.5 శాతం) ఉండటంతో నికర వడ్డీ ఆదాయం 54 శాతం ఎగసి రూ.1,124 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇతర ఆదాయం 48 శాతం పెరిగి రూ.234 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నిర్వహణ లాభం రూ.574 కోట్ల నుంచి 57 శాతం పెరిగి రూ.900 కోట్లకు చేరిందని తెలిపారు. గత క్యూ3లో 9.9 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ3లో 10.3 శాతానికి పెరిగిందని వివరించారు.

క్యూ3లో టీసీఎస్ అదరహో

- భారీ లాభాలను ఆర్జించిన టెకీ దిగ్గజం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) మార్కెట్ అంచనాలకు మించి రికార్డు లాభాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 24.1 శాతం వ ద్ధితో రూ.8,105 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.6,531 కోట్ల లాభాలు ఆర్జించింది. టాటా గ్రూపునకు సింహభాగం రెవెన్యూను అందిస్తుంది. క్రితం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో తమ రెవెన్యూలో 21 శాతం వ ద్ధి చోటు చేసుకుందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎండి రాజేష్ గోపినాథ్ పేర్కొన్నారు. గత 14 త్రైమాసికాల్లో ఇదే రికార్డు రెవెన్యూ అని పేర్కొన్నారు. భౌగోళికంగానూ, అన్ని కేటగిరీల్లోనూ మెరుగైన వ ద్ధిని నమోదు చేశామన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.2 మధ్యంతర డివిడెండ్ అందించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. దీంతో వరుసగా మూడోసారి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించినట్లయ్యింది. తాజాగా ప్రకటించిన ఈ డివిడెండ్‌ను జనవరి 24 నాటికి చెల్లించనున్నారు. కాగా జనవరి 18వ తేదిని రికార్డు తేదిగా గుర్తించనున్నారు. మూడో త్రైమాసికంలో కొత్తగా 6,827 మంది ఉద్యోగులను తీసుకున్నారు. దీంతో డిసెంబర్ ముగింపు నాటికి టిసిఎస్ మొత్తం సిబ్బంది 4,17,929కి చేరింది. గురువారం బిఎస్‌ఇలో టిసిఎస్ షేర్ 0.02 శాతం పెరిగి రూ.1,885 వద్ద ముగిసింది. ఐటి కంపెనీ ఒక త్రైమాసికంలో రూ.8000 కోట్ల పైగా లాభాలు నమోదు చేయడం సాఫ్ట్‌వేర్ రంగంలోనే ఒక కీలక మైలురాయి. ఇంతక్రితం జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో ఈ కంపెనీ రూ.7,927 కోట్ల లాభాల నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 20.80 శాతం పెరిగి రూ.37,338 కోట్లుగా చోటు చేసుకుందని బిఎస్‌ఇకి టిఎస్‌ఎస్ వెల్లడించింది. స్థిర కరెన్సీ ధరల వల్ల కంపెనీ రెవెన్యూ త్రైమాసికం, త్రైమాసికానికి 1.8 శాతం, ఏడాదికేడాదికి గాను 12.1 శాతం పెరుగుదల నమోదయ్యింది. గత క్యూ3లో డిజిటల్ ఎకౌంట్ రెవెన్యూ 52.7 శాతం వ ద్ధిని నమోదు చేసింది. మొత్తం రెవెన్యూలో ఈ విభాగం వాటా 30.1 శాతంగా ఉందని తెలిపింది.



ఓ లైఫ్ చూసినట్టుగా అనిపించింది

ఎన్టీఆర్ జీవితాన్ని 'యన్.టి.ఆర్' అనే బయోపిక్‌గా రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ బయోపిక్‌లో తొలి భాగం 'యన్.టి.ఆర్ కథానాయకుడు' జనవరి 9న విడుదలైంది. కృష్ణ, విజయ నిర్మల ఈ సినిమాను ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ''నందమూరి బాలకృష్ణ రూపొందించిన యన్.టి.ఆర్ బయోపిక్ చూశాను. చాలా బావుంది. సినిమా చూసినట్లు కాకుండా ఒక లైఫ్ చూసినట్టు అనిపించింది. బాలకృష్ణగారు.. ఎన్టీఆర్‌గారిలా వందశాతం కనిపించారు. ఆయన వేసిన అన్నీ గెటప్స్‌లోనూ బావున్నారు. డెఫనెట్‌గా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. విజయ నిర్మల మాట్లాడుతూ ''నాకు పన్నెండేళ్ల వయసు ఉన్నప్పుడు ఎన్టీఆర్‌గారితో కలిసి 'పాండు రంగ మహత్యం' చేశాను. ఆ సినిమాలో కృష్ణుడిగా నటించాను. బయోపిక్ చూస్తుంటే ఎన్టీఆర్‌గారిని చూస్తున్నట్లుండేలా బాలకృష్ణగారు నటించారు. సినిమా చాలా బావుంది. చాలా సంతోషం''అన్నారు. నరేశ్ మాట్లాడుతూ ''యన్.టి.ఆర్' బయోపిక్ అనౌన్స్ అయినప్పుడు ఇందులో ఓ అవకాశం వస్తుందా! అని ఆసక్తిగా ఎదురుచూశాను. మా అమ్మగారి తొలి సినిమా ఆయనతోనే నటించారు. అలాగే నేను ప్రేమ సంకెళ్లు సినిమా సమయంలో ఆయన ఆశీర్వాదం తీసుకున్నాను. ఈ బయోపిక్‌లో వేషం వేయాలని నన్ను అడిగినప్పుడు చాలా సంతోషం వేసింది. అది కూడా బి.ఎ.సుబ్బారావుగారి వేషం. ఆ సన్నివేశాలను నేను చేస్తున్నప్పుడు థ్రిల్ ఫీలయ్యాను. దర్శకుడు క్రిష్‌గారు ఈ సినిమాతో గ్రేట్ డైరెక్టర్ నుండి లెజెండ్రీ డైరెక్టర్ అయ్యారు. ఈ సినిమాతో బాలకృష్ణగారు మహానటుడిగా అవతరించారు తనకు హ్యాట్సాఫ్'' అన్నారు.

మోదీతో బాలీవుడ్ తారలు

బాలీవుడ్‌కు చెందిన కొంతమంది యంగ్ హీరోలు, కొందరు దర్శకులు భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇండస్ట్రీకి ఉన్న సమస్యలు, సామాజిక కార్యక్రమాల కోసం తాము చెయ్యాల్సిన పనులు.. మొదలైన అంశాలు ఈ సమావేశంలో చోటు చేసుకున్నాయి. అలాగే సినిమా టిక్కెట్లపై జి.ఎస్.టి.ని తగ్గించినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహార్ నేతృత్వంలో మోదీని కలిసిన వారిలో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా, ఆయుష్మాన్ ఖురానా, విక్కీ కౌశల్, రాజ్‌కుమార్ రావ్, ఆలియా భట్, ఏక్తా కపూర్, భూమి ఫడ్నేకర్‌లతోపాటు రోహిత్‌శెట్టి, అశ్విని అయ్యర్ కూడా ఉన్నారు. అనంతరం ప్రధానితో తీసుకున్న సెల్ఫీని కరణ్ జోహార్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.





అదిరిపోయే బ్రొమాన్స్ ఖాయం

వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్స్‌గా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందిన చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వెంకటేష్ మాట్లాడుతూ ''ఈ సంక్రాంతి పండుగకి ఎఫ్ 2 రావడం చాలా ఆనందంగా ఉంది. సాధారణంగా పండగలకు వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ సంక్రాంతికి ఎఫ్2.. సంక్రాంతి అల్లుళ్లుగా వస్తున్నాం. కథ, దర్శకుడిని నమ్మి సినిమా చేశాను. చాలా నేచురల్‌గా చేశాను. అనీల్ కూడా చాలా ఫ్రీ డమ్ ఇచ్చి చేయించుకున్నాడు. వరుణ్‌తేజ్, రాజేంద్రప్రసాద్‌గారితో కలిసి పనిచేయడం ఆనందంగా అనిపించింది. తమన్నా, మెహరీన్ వండర్ వర్క్ చేశారు.'' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''ఫస్ట్ టైం ఓ మాస్ క్యారెక్టర్ చేశాను. కామెడీ క్యారెక్టర్. ఈ సినిమా ఎప్పుడు స్టార్ట్ అయ్యింది.. ఎప్పుడు అయిపోయిందో తెలియడం లేదు. ఈ జర్నీ నాకు మెమొరబుల్‌గా ఉండిపోతుంది. ఆయన నా జర్నీ ఓ నటుడిగా ప్రారంభమై, బ్రదర్‌లా మారింది. ఈ సినిమాతో అనిల్‌లాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఆనందంగా ఉంది. దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌గారితో ఫిదా చేశాం. మా పెద్దనాన్నగారి కాన్‌టెంపరరీ హీరో వెంకటేష్‌గారితో సినిమా చేయాలంటే ఎక్కడో చిన్న భయం ఉండేది. కానీ ఆయన మాతో చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. ఫ్రెండ్‌లా, మెంటర్‌లా మాతో ఉన్నారు. నెక్స్ట్ టైం ఆయనతో స్టోరీ కూడా అడగకుండానే సినిమా చేయడానికి నేను రెడీ. ఈ సినిమాలో మా ఇద్దరి బ్రొమాన్స్ అద్భుతంగా ఉండబోతోంది. '' అన్నారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ ''ఓ సినిమా సిద్ధం అవ్వడానికి 24 క్రాఫ్ట్స్ కష్టం ఉండాల్సిందే. ఈ సినిమాకీ మేమంతా అలానే కష్టపడ్డాం'' అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తమన్నా, మెహరీన్, రాజేంద్ర ప్రసాద్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



మార్చి 1న '118'

కల్యాణ్‌రామ్, తమన్నా జంటగా ఇటీవల విడుదలైన 'నా నువ్వే' అందర్నీ నిరాశ పరిచిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత కల్యాణ్‌రామ్ చేస్తున్న చిత్రం '118'. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ సినిమాపై అంచనాలను ఏర్పరుస్తోంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను మార్చి 1న విడుదల చేయడానికి దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ కె.వి.గుహన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేశ్ ఎస్. కోనేరు నిర్మిస్తున్నారు. షాలిని పాండే, నివేదా థామస్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి శేఖర్‌చంద్ర సంగీతం అందిస్తున్నారు.






విశాల్

పెళ్లి ఫిక్స్.. వెన్యూ ఫిక్స్!

తమిళ్, తెలుగు సినిమాల్లో హీరోగా మంచి సినిమాలు చేసి పేరు తెచ్చుకున్న విశాల్ ఇప్పుడు పెళ్ళి చేసుకోబోతున్నాడు. సాధారణంగా ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అంటూ వుంటారు. కానీ, విషయంలో అది రివర్స్ అయిందని చెప్పాలి. ఎందుకంటే తమిళ నటీనటుల సంఘానికి సొంత భవనం నిర్మించిన తర్వాతే పెళ్ళి చేసుకుంటానని గతంలో చాలా సార్లు చెప్పారు. ప్రస్తుతం అది నిర్మాణంలో ఉంది. దాంతో పాటు నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా నిర్మాతల మండలి కోసం ఓ భవంతి కట్టిస్తున్నారు విశాల్. ఇక పెళ్లి చేసుకోవడమే ఆలస్యం. పెళ్లి కూడా ఖరారైంది. 'త్వరలోనే హైదరాబాద్‌కు చెందిన బిజినెస్‌మేన్ కూతురు అనీషాతో విశాల్ వివాహం చేయబోతున్నాం' అని విశాల్ తండ్రి, నిర్మాత జి.కె.రెడ్డి ప్రకటించారు. దాంతో అది పెద్దలు కుదిర్చిన వివాహం అనుకున్నారంతా. కానీ ప్రేమ వివాహమే అని విశాల్ కన్‌ఫర్మ్ చేశారు. హైదరాబాద్ బిజినెస్‌మేన్ విజయ్‌రెడ్డి, పద్మజ కుమార్తె అనీషను విశాల్ పెళ్లాడనున్నారు. ''మాది లవ్ మ్యారేజ్. వచ్చే వారంలో మా రెండు కుటుంబాలు కలుసుకొని ఎంగేజ్‌మెంట్ డేట్‌ని ఫిక్స్ చేస్తారు. నిర్మాతల సంఘం నూతన భవన నిర్మాణం పూర్తయ్యాక, అందులోనే పెళ్లి చేసుకుంటాను'' అని విశాల్ పేర్కొన్నారు.

ఫార్ములా సినిమానే కావాలి...





సంపత్ నంది, గోపిచంద్

గోపీచంద్, సంపత్ నంది కాంబినేషన్‌లో 'గౌతమ్‌నంద' సినిమా రూపొందిన సంగతి తెలిసిందే. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ కాలేదు. అయితే కూడా గోపీచంద్ మరోసారి సంపత్ నందితోనే సినిమా చేయబోతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఎక్స్‌పెరిమెంటల్ మూవీ కాకుండా ఫార్ములా మూవీ చేద్దామని గోపీచంద్.. సంపత్‌నందితో అన్నాట్ట. నిర్మాత కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారట. ప్రస్తుతం గోపీచంద్ తిరు దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే సంపత్ నంది దర్శకత్వంలో సినిమా చేస్తారని సమాచారం. ఈలోపు సంపత్ నంది స్క్రిప్ట్ వర్క్ సహా ప్రీ ప్రొడక్షన్ పనులను పూర్తి చేసుకుంటారట.



లక్ష్మీ

సమంత యంగ్ లుక్‌లోనే...

కెరీర్ ప్రారంభంలో గ్లామర్ పాత్రలు, కమర్షియల్ సినిమాలు ఎక్కువగా చేసిన సమంత ఇప్పుడు వైవిధ్యమైన పాత్రలు చేయడానికి ఆసక్తిని కనపరుస్తున్నారు. ప్రస్తుతం ఈమె ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి దర్శకత్వంలో 'ఓ బేబి ఎంత సక్కగున్నావే'(వినపడుతున్న టైటిల్) సినిమాలో నటిస్తుంది. కొరియన్ చిత్రం 'మిస్ గ్రానీ'కి ఇది రీమేక్. ఈ సినిమాలో సమంత 70 ఏళ్ల ముసలి భామ పాత్రలో కనిపిస్తుందని వార్తలు వినిపించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సినిమాలో ముసలి ఆవిడ పాత్రతో పాటు వయసులోని అమ్మాయి పాత్ర కూడా ఉంటుందట. ఇందులో ముసలి పాత్రను సమంత చేయడం లేదట. యంగ్ లుక్ ఉన్న పాత్రలోనే సమంత కనిపించనుందనేది సమాచారం. ముసలావిడ పాత్రలో సీనియర్ నటి లక్ష్మి నటించబోతున్నారట. ఇందులో నాగశౌర్య కూడా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు.





కృష్ణవంశీ, నానా పటేకర్

16 ఏళ్ల తర్వాత...

కృష్ణవంశీ దర్శకత్వంలో ప్రకాశ్‌రాజ్, సౌందర్య, జగపతిబాబు ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'అంతఃపురం'. ఈ చిత్రాన్ని నానా పటేకర్ ప్రధాన పాత్రధారిగా హిందీలో కూడా కృష్ణవంశీ రీమేక్ చేశారు. ఇప్పుడు మళ్లీ 16 ఏళ్లకు నానా పటేకర్‌తో ఈ దర్శకుడు సినిమా చేయబోతున్నారు. అది కూడా హిందీ వెర్షన్‌లో.. ఇదే సినిమాను తెలుగులో ప్రకాశ్‌రాజ్‌తో కృష్ణవంశీ తెరకెక్కించబోతున్నారు. చాలా కాలంగా మంచి సక్సెస్ కోసం వెయిట్ చేస్తున్న ఈ దర్శకుడు ఈసారి ఏకంగా రెండు సినిమాలను చేయబోతున్నారని సినీ వర్గాల సమాచారం. త్వరలోనే ఆ సినిమా వివరాలు వెల్లడి కానున్నాయి.



తాప్సీ

తొమ్మిదో తరగతిలోనే...

తెలుగు, తమిళ భాషలతోపాటు హిందీ సినిమాల్లోనూ తన నటనతో అందర్నీ ఆకట్టుకుంటున్న తాప్సీ ఇప్పుడు పిబిఎల్‌లోకి ఎంటర్ అయింది. పూనె 7 ఏసెస్ జట్టుకి సహ యజమానిగా వ్యవహరిస్తోంది. ఇటీవల మీడియాతో ముచ్చటించిన తాప్సీ తన వ్యక్తిగత విషయాలను సైతం తెలిపింది. '''నేను తొమ్మిదో తరగతిలో చదువుతున్నప్పుడే ప్రేమలో పడ్డాను. అయితే నా స్నేహితులందరి కంటే నేనే ఆలస్యంగా ప్రేమించాను. కానీ నేను ప్రేమించిన అబ్బాయి పదో తరగతి పరీక్షలొస్తున్నాయని నన్ను వదిలేశాడు. అప్పుడు తనకు ఫోన్ చేసి ఏడ్చేదాన్ని. నన్నెందుకు వదిలేశావ్? అని అడిగేదాన్ని. ఇప్పుడు అవన్నీ తలుచుకుంటే నవ్వొస్తుంది. నేను ఆగస్టు 1న పుట్టాను. నాది సింహరాశి. నా వ్యక్తిగత జీవితంలోనూ, నేను చేసే పనిలో నేను హైలైట్‌గా ఉండాలనుకుంటాను. నేను పెళ్లాడబోయే వ్యక్తి ఆలోచనలు కూడా నాలానే ఉండాలి. మా అభిప్రాయాలు కలవాలి. తనను చూడగానే మర్యాద ఇవ్వాలని నాకు అనిపించాలి. నేను ప్రేమలో ఉన్నా, ఎవరినైనా పెళ్లి చేసుకోబోతున్నా ఆ విషయం నేను ఓపెన్‌గానే చెప్పేస్తాను'' అంది తాప్సీ.



మోదీకి భయం మొదలైంది

- అందుకే సీబీఐ చీఫ్‌ను సాగనంపారు
- కాంగ్రెస్ అధినేత రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. సీబీఐ చీఫ్ పదవి నుంచి అలోక్‌వర్మను తప్పించాలని మోదీ నేతృత్వంలోని హైపవర్ కమిటీ నిర్ణయించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన సొంత అబద్ధాలకు బందీ అయ్యారంటూ మోదీని విమర్శించారు. రఫేల్ ఫైటర్ జెట్ విమానా కొనుగోలు ఒప్పందంలో జరిగిన అవినీతి గురించిన భయం మోదీ మదిలో తిరుగుతోందని, అందుకే దానిపై దర్యాప్తు చేస్తున్న అధికారిని తప్పించారని అన్నారు. భారత వైమానిక దళం నుంచి రూ. 30 వేల కోట్లు దొంగిలించి అనిల్ అంబానీకి ఇచ్చారని, ఇప్పుడు వరుసగా రెండోసారి సీబీఐ చీఫ్ పదవి నుంచి అలోక్‌వర్మను తప్పించడం ద్వారా ఆయన ఇప్పుడు తన సొంత అబద్ధాలకు ఖైదీ అని నిరూపితమైందని ట్వీట్ చేశారు. చివరలో సత్యమేవ జయతే అని కూడా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. గత అక్టోబరు నెలలో అర్ధరాత్రి సమయంలో సీబీఐ చీఫ్ పదవినుంచి అలోక్‌వర్మను తప్పించారని, అసలు వర్మపై ఉన్న అవినీతి ఆరోపణలు ఏవీ నిరూపితం కాకముందే అలా చేశారని రాహుల్ ఆరోపిస్తున్నారు. రఫేల్ డీల్ గురించి ఆయన విచారణ మొదలుపెట్టడం వల్లే తప్పించారని అన్నారు.

పాపం.. రాహుల్‌గాంధీ!

- **అలోక్‌వర్మ కంటే ఆయనకే ఎక్కువ బాధ: బీజేపీ**

న్యూఢిల్లీ, జనవరి 11: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై బీజేపీ శుక్రవారం వ్యంగ్యాస్త్రాలు సంధించింది. అలోక్ వర్మను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చీఫ్ పదవి నుంచి తొలగించడంపై ఆయన కన్నా ఎక్కువగా రాహుల్ విలపిస్తున్నారని బీజేపీ ఎద్దేవా చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ అలోక్ వర్మ కన్నా ఎక్కువగా రాహుల్ గాంధీ ఏడుస్తున్నారన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ చాపర్స్ ఒప్పందం కుంభకోణం కేసులో నిజాలను రాబట్టేందుకు సీబీఐ ప్రయత్నిస్తుండటం వల్లే కాంగ్రెస్ సీబీఐ వ్యవహారంలో జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. యూపీయే హయాంలో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాలపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తున్న సంగతిని గుర్తు చేశారు. ''సీబీఐ విషయంలో అలోక్ వర్మ కన్నా ఎక్కువగా రాహుల్ గాంధీ ఏడుస్తున్నారు. సీబీఐలో నిజంగా జరుగుతున్న దర్యాప్తు అగస్టా వెస్ట్‌లాండ్, ఇతర డిఫెన్స్ డీల్స్ గురించి'' అని జీవీఎల్ తెలిపారు.


మోదీ ఏం వాజ్‌పేయి కారు..

- **తనను వాజ్‌పేయితో పోల్చుకోవడమే విడ్డూరం!**
- **బీజేపీతో దోస్తీకిససేమిరా.. స్టాలిన్**



న్యూఢిల్లీ, జనవరి 11: బీజేపీతో తాము చే తులు కలిపే ప్రసక్తే లేదని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ వాజ్‌పేయి కాదని, కానీ తనను తాను వాజ్‌పేయితో పోల్చుకోవడం విడ్డూరమంటూ స్టాలిన్ మోదీ తాజా వ్యాఖ్యలపై మండిపడ్డారు. ''మోదీ నేతృత్వంలో ఉన్నది ఆరోగ్యకర మైన కూటమి కాదు. తనను తాను వాజ్‌పేయితో మోదీ పోల్చుకోవడం మరీ విడ్డూరంగా ఉంది'' అంటూ స్టాలిన్ పేర్కొన్నారు. పాత మిత్రుల కోసం తమ తలుపులు తెరిచే ఉంటాయంటూ గురువారం మోదీ చేసిన వ్యాఖ్యలపై స్టాలిన్ శుక్రవారం ఘాటుగా స్పందించారు. తమిళనాడు లోని ఐదు జిల్లాల్లోని బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే జయలలిత మరణం తరువాత అధికార అన్నాడీఎంకే బీజేపీకి సన్నిహితంగా మెలుగుతున్నప్పటికీ రాష్ట్రంలో పార్టీ పరిస్థితి మాత్రం చాలా బలహీనంగా తయారుకావడంతో డీఎంకే బలమైన ప్రతిపక్షంగా ఎదిగింది. మరోవైపు డీఎంకే అధినేత ఎం.కరు ణానిధి మరణం తరువాత చెన్నైలోని మెరీనా బీచ్‌లో ఆయన స్మార కాన్ని నిర్మిస్తామన్న బీజేపీ ప్రకటన పలు రాజకీయ ఊహాగానాలకు తావిచ్చింది. వాజ్‌పేయి హయాంలో ఎన్డీఏ సంకీర్ణ కూటమిలో భాగస్వా మిగా ఉన్న డీఎంకే 1999 తరువాత బీజేపీతో సంబంధాలు తెగతెంపులు చేసుకుంది.

డేరా బాబా దోషి



- జర్నలిస్టు హత్య కేసులో కోర్టు తీర్పు
- మరో ఇద్దరు కూడా దోషులే..
- అత్యాచారం కేసులో ఇప్పటికే జైలులో గుర్మీత్


న్యూఢిల్లీ, జనవరి 11: డేరా బాబా గుర్మీత్‌సింగ్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. జర్నలిస్ట్ రామచంద్ర ఛత్రపతి హత్య కేసులో గుర్మీత్ రామ్ రహీంతో పాటు మరో ముగ్గురిని సీబీఐ ప్రత్యేక కోర్టు దోషులుగా తేల్చింది. కేసులో ఈ నెల 17వ తేదీన శిక్ష తీర్పును వెలవరించనున్నట్లు పేర్కొంది. గుర్మీత్ సింగ్ మహిళల వేధింపుల గురించి జర్నలిస్ట్ రామచంద్ర 2002లో ప్యూర్ సచ్ఛ్ న్యూస్ పేపర్‌లో వార్తా కథనాలు రాశాడు. ఈ వార్తా ప్రచురణ అనంతరం అతడు హత్యకు గురయ్యాడు. దర్యాప్తులో గుర్మీత్ సింగ్ ప్రధాన కారకుడిగా ఉన్నట్లు తేలింది. కేసు విచారణ చేపట్టిన పంచకుల సీబీఐ ప్రత్యేక కోర్టు జర్నలిస్ట్ హత్య కేసులో గుర్మీత్ సింగ్‌తో పాటు మరో ముగ్గురిని దోషులుగా తేల్చుతూ శుక్రవారం తీర్పును వెలువరించింది. కాగా తన ఇద్దరు మహిళా అనుచరులను అత్యాచారం చేసిన కేసులో గుర్మిత్‌సింగ్ ఇప్పటికే జైలు జీవితం గడుపుతున్నాడు. 2002లో సిర్సాకు చెందిన జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతిని హత్య చేసినందుకు గాను గుర్మీత్‌పై కేసు నమోదు అయ్యింది. తీర్పు నేపథ్యంలో పంచకుల, హరియాణా ప్రాంతాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కేసు విచారణకు దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులు న్యాయస్థానానికి హాజరయ్యారు. కాగా గుర్మీత్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యాడు. ప్రస్తుతం గుర్మీత్ అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు శిక్షను అనుభవిస్తున్నాడు. హరియాణాలోని రోహ్‌తక్ సునారియా జైల్లో ఖైదీగా ఉన్నాడు. అత్యాచార కేసు తీర్పు సమయంలో పంచకులలో పెద్ద ఎత్తున అల్లర్లు చోటు చేసుకొని 40 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పంచకులతో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అసలు కేసు ఏమిటంటే..

డేరా ఆశ్రమంలో గుర్మీత్ చేస్తున్న ఆక త్యాలను 'పూరా సచ్' వార్తాపత్రికకు చెందిన జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతి వెలుగులోకి తీసుకొచ్చారు. ఆశ్రమానికి వచ్చిన మహిళలను లైంగికంగా వేధిస్తూ, వారిపై అత్యాచారాలకు ఒడిగడుతున్నట్లు ఛత్రపతి వార్తలు రాసుకొచ్చాడు. దీంతో అక్టోబరు 24, 2002న ఛత్రపతిని ఆయన ఇంట్లోనే దారుణంగా కాల్చి చంపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్మీత్‌తో పాటు ఆయన అనుచరులు కుల్దీప్‌సింగ్, నిర్మల్ సింగ్ ఉన్నారు. కృషన్‌లాల్‌కు చెందిన రివాల్వర్‌తో కుల్దీప్, నిర్మల్.. జర్నలిస్టును హత్య చేశారు. 2003లో వీరందరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను 2006లో సీబీఐ చేతికి అప్పగించారు. అప్పటి నుంచి కొనసాగిన ఈ కేసు విచారణలో శుక్రవారం తుది తీర్పు వెలువడింది. ఈ కేసు విచారించిన న్యాయస్థానం గుర్మీత్‌తో పాటు కుల్దీప్, నిర్మల్, కృషన్‌ను దోషులుగా తేల్చింది.

2020లో చంద్రయాన్

- మానవరహిత అంతరిక్ష యానం
- బృందంలో ఓ మహిళ కూడా..
- ఆస్ట్రోనాట్లకు 'వ్యోమనాట్లు'గా పేరు
- ఇస్రో చైర్మన్ కే శివన్ వెల్లడి





బెంగళూరు, జనవరి 11 : త్వరలో గగన్‌యాన్ మిషన్ ప్రారంభం కాబోతోందని ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడించారు. ఇస్రోకి ఇది పెద్ద మరపురానిదిగా గగన్‌యాన్ నిలవబోతోందని ఆయన అన్నారు. 2020 డిసెంబర్ నాటికి రెండు మానవరహిత అంతరిక్ష కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు శివన్ తెలిపారు. ఇస్రో తదుపరి ప్రాజెక్టు పీఎస్ఎల్‌వీ సీ-44 అని అన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా 6 ఇస్రో ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, మార్చి 25 నుంచి ఏప్రిల్‌లోగా చంద్రయాన్-2 ప్రయోగం చేయనున్నట్లు శివన్ వెల్లడించారు.ఇస్రో సాంకేతిక పరిజ్ఞానంలో మేటి అయిన భారీ రాకెట్ జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మార్క్-3(జీఎస్ఎల్‌వీఎంకే-3) ద్వారా మిషన్ గగన్‌యాన్ ఆపరేషన్ చేపట్టబోతున్నారు. భారత్ నుంచి ఇస్రో ప్రయోగిస్తున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ ఇది. దీంతో ఇప్పటికే మానవ సహిత అంతరిక్ష మిషన్స్ నిర్వహించిన అమెరికా, చైనా, రష్యా జాబితాలో ఇండియా చేరబోతోంది. గగన్‌యాన్ సేవలు అందుబాటులోకి వస్తే విద్యాసంస్థలు, పరిశ్రమలు, జాతీయ సంస్థలు, ఇతర సైంటిఫిక్ సంస్థల మధ్య సమన్వయం సాధ్యపడనుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచే ప్రాజెక్టు 'గగన్‌యాన్'. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ద్వారా 2021 డిసెంబరు నాటికి భారత్ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు కె.శివన్ వెల్లడించారు. గగన్‌యాన్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపితే.. స్వతంత్రంగా మనుషులను అంతరిక్షంలోకి పంపిన నాలుగో దేశంగా భారత్ ఘనత దక్కించుకోనుంది. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని నరేంద్ర మోదీ గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రకటన చేశారు. 2022నాటికి వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు ప్రణాళిక వేస్తున్నట్లు చెప్పారు. అయితే ఇప్పుడు శివన్ 2021 డిసెంబరు నాటికే పంపాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. 'గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా పంపే వ్యోమగాములకు తొలుత భారత్‌లో, తర్వాత రష్యాలో శిక్షణ ఇప్పిస్తాము. బృందంలో మహిళ కూడా ఉంటారు. ఇది మా లక్ష్యం' అని శివన్ తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించింది. ముగ్గురు వ్యోమగాములను వారం పాటు అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రష్యా, ఫ్రాన్స్‌లతోభారత్ ఒప్పందం కుదుర్చుకుంది. వ్యోమగాముల బృందం పూర్తిగా పురుషులతో కూడుకున్నది కాదని.. ఆ బృందంలో ఓ మహిళ కూడా ఉంటారని ఆయన తెలిపారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో చంద్రయాన్-2

ఈ ఏడాది ఏప్రిల్‌లో చంద్రుడిపైకి 'చంద్రయాన్-2'ను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శివన్ వెల్లడించారు. ఇస్రో తొలుత 'చంద్రయాన్-2'ను జనవరి నుంచి ఫిబ్రవరి 16 మధ్యలో చేపడతామని తెలిపింది. అయితే కొన్ని పరీక్షలు పూర్తికాకపోవడం వల్ల తేదీని మార్చారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ చివరి నాటికి ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని నేడు శివన్ తెలిపారు. పదేళ్ల క్రితం పంపిన చంద్రయాన్-1కు ఇది అడ్వాన్స్‌డ్ వర్షెన్. రూ.800కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు.





బాల్ ఠాక్రే రక్తమే ఉంటే..!


- కేబినెట్ నుంచి బయటకెళ్లండి చూద్దాం
- శివసేనకు ఎన్సీపీ నాయకుడి సవాలు

ముంబై, జనవరి 11: మహారాష్ట్రలో పొత్తు లేకపోతే తమ మాజీ భాగస్వామిని పాతాళానికి తొక్కేస్తామని బీజేపీ అధ్యక్షుడు పరోక్షంగా హెచ్చరించిన తర్వాత.. శివసేనకు మరో సవలు ఎదురైంది. ఈసారి ఎన్సీపీ మహారాష్ట్ర విభాగం అధ్యక్షుడు జయంత్ పాటిల్ శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేని సవాలు చేశారు. ''వేరే పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు మిమ్మల్ని పాతాళానికి తొక్కేస్తామంటున్నారు. మీ నరాల్లో నిజంగా బాలాసాహెబ్ ఠాక్రే (శివసేన వ్యవస్థాపకుడు) రక్తమే ప్రవహిస్తుంటే.. రేపు ఉదయమే కేబినెట్ నుంచి బయటకు వచ్చి మీ ధైర్యం ఏంటో చూపించండి'' అని జయంత్ పటేల్ సవాలు చేశారు.

శివసేన పార్టీ ఒకవైపు బీజేపీ మీద విమర్శలు గుప్పిస్తూ ఉంటే.. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే మాత్రం వెళ్లి రెండు రోజుల క్రితం ఒక హోటల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను కలిశారని పాటిల్ ఆరోపించారు. ఇద్దరి మధ్య ఏం చర్చలు జరిగాయో తనకు చెప్పాలన్నారు. ప్రస్తుతం దేశంలో ఎవరి వైపూ గాలి లేదని.. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రాధాన్యం క్రమంగా వెలిసిపో తోందని పాటిల్ అన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను బీజేపీ పీడ వదిలిపోయేందుకు తాము పరివర్తన్ యాత్రలు ప్రారంభించామని జయంత్ పాటిల్ చెప్పారు. ఈ ర్యాలీలో పార్టీ సీనియర్ నాయకులు ఛగన్ భుజ్‌బల్, అజిత్ పవార్, ధనంజయ్ ముండే తదితరులు కూడా మాట్లాడారు. తాజాగా అగ్రవర్ణ పేదలకు కల్పించిన 10% రిజర్వేషన్ కోటాపై అజిత్ పవార్ మండి పడ్డారు. రిజర్వేషన్లను ఆదాయపన్ను చెల్లించేవా రికి ఇస్తున్నారు తప్ప పేదవాళ్లకు కాదని ఆయన అన్నారు.

అద్భుతం జరగొచ్చు

- ప్రాణాలతో ఉంటారేమో
- గనిలో సహాయ చర్యలు ఆపొద్దు
- మేఘాలయకు సుప్రీం సూచన



షిల్లాంగ్, జనవరి 11: మేఘాలయలోని తూర్పు జయంతియా హిల్స్ జిల్లా బొగ్గు గనిలో చిక్కుకుపోయిన 15 మంది కూలీలను కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగించాల్సిందిగా సర్వోన్నత న్యాయస్థానం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇందుకోసం నిపుణుల సహాయం కూడా తీసుకోవాల్సిందిగా సూచించింది. అక్రమంగా గనుల తవ్వకాలు చేపడుతున్న వారికి వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని న్యాయస్థానం మేఘాలయ అధికారులను ప్రశ్నించింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను విచారిస్తోన్న జస్టిస్ ఎ.కె.సిక్రి నేత త్వంలోని ధర్మాసనం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. అసలు అక్రమంగా గనులు తవ్వేందుకు ఎవరు అనుమతులు ఇస్తున్నారని న్యాయస్థానం ప్రశ్నించింది. ''మీ సహాయక చర్యలను కొనసాగిస్తూనే ఉండండి. ఏదైనా అద్భుతం జరిగి అందరూ లేదా వాళ్లలో కనీసం కొందరైనా బతికి ఉండొచ్చేమో'? అని సిక్రి ధర్మాసనం వ్యాఖ్యలు చేసింది. అధిక శక్తి గల పంపుల ద్వారా గనిలో నుంచి ఇప్పటి వరకు కోటి లీటర్ల నీటిని బయటకు తోడినట్లు మేఘాలయ అధికారులు సుప్రీంకోర్టుకు తెలియజేశారు. అయితే.. దగ్గర్లో ఉన్న నది కారణంగా నీటి స్థాయిలు ఏమాత్రం తగ్గడం లేదని సహాయక చర్యలకు ఇది తీవ్ర ఆటంకంగా మారిందని పేర్కొన్నారు. సహాయక చర్యల కోసం నేవీ సిబ్బంది రిమోర్ట్‌లతో పని చేసే ఐదు వాహనాలతో రంగంలోకి దిగి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అక్రమంగా గని తవ్వకం చేపట్టిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఒడిశా అగ్నిమాపక దళం, రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బంది, రాష్ట్ర అగ్నిమాపక దళంతో పాటు ఇతర కంపెనీలకు చెందిన సిబ్బంది నిరంతరం గని దగ్గర సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. డిసెంబరు 13న తూర్పు జయంతియా జిల్లాలో పలువురు కూలీలు అక్రమంగా బొగ్గు గని తవ్వేందుకు వెళ్లగా.. అదే సమయంలో వరదలు సంభవించి గనిలోకి నీరు చేరింది. అదృష్టవశాత్తూ ఐదుగురు కూలీలు ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 15 మంది అందులో చిక్కుకుపోయారు. దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ వారి ఆచూకీ మాత్రం ఇంకా లభ్యం కాలేదు. కూలీల జాడ తెలుసుకునేందుకు సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

మ్యాథ్స్‌లో రెండు స్థాయిలు

- ఏదైనా ఒక స్థాయి ఎంచుకోవచ్చు
- విద్యార్థులకు సీబీఎస్ఈ ఆఫర్

న్యూఢిల్లీ, జనవరి 11: సీబీఎస్ఈ పదో తరగతి విద్యార్థులకు ఓ ఆఫర్ ఇచ్చింది. 2020లో బోర్డ్ ఎగ్జామ్స్ రాయబోయే పదో తరగతి విద్యార్థులకు రెండు స్థాయిల మ్యాథ్స్‌ను పరిచయం చేస్తున్నది. ఈ రెండు స్థాయిల్లో విద్యార్థులు ఏది కావాలంటే అది ఎంపిక చేసుకోవచ్చు. అంతమాత్రాన పదో తరగతి మ్యాథమెటిక్స్ కరికులమ్‌లో ఎలాంటి మార్పు ఉండబోదని, అవే టాపిక్స్, చాప్టర్స్ ఉంటాయని బోర్డు స్పష్టం చేసింది. తొలిసారి బోర్డు ఎగ్జామ్స్ ఎదుర్కోబోయే విద్యార్థులుగా వాళ్లపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికే ఇలా రెండు స్థాయిల మ్యాథ్స్‌ను పరిచయం చేసినట్లు చెప్పింది. సబ్జెక్టుల ఎంపికలో ఇప్పటికే స్టూడెంట్స్‌కు ఆప్షన్ ఇచ్చినట్లు ఒకే సబ్జెక్టులోనూ ఇవ్వాలని భావించినట్లు బోర్డు తెలిపింది. దీని ప్రకారం తొలి స్థాయి ఇప్పుడున్న మ్యాథ్సే ఉంటుంది. రెండో స్థాయి మ్యాథ్స్ సులువుగా ఉంటుంది.

ఇప్పుడున్న సబ్జెక్ట్‌ను మ్యాథమెటిక్స్ స్టాండర్డ్‌గా, సులువుగా ఉన్నదాన్ని మ్యాథమెటిక్స్ బేసిక్‌గా పిలవనున్నారు. సిలబస్, క్లాస్ రూమ్ టీచింగ్, ఇంటర్నల్ అసెస్‌మెంట్ రెండు స్థాయిలకు సమానంగానే ఉంటుంది. సబ్జెక్ట్‌ను మొత్తంగా తెలుసుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. చివరగా తన సామర్థ్యాన్ని బట్టి ఎగ్జామినేషన్ ఏ స్థాయిలో రాయాలో తేల్చుకోవచ్చు అని సీబీఎస్ఈ అధికారి ఒకరు వెల్లడించారు. పదో తరగతి తర్వాత కూడా మ్యాథ్స్‌నే ప్రధాన సబ్జెక్ట్‌గా ఎంపిక చేసుకునే వాళ్లకు స్టాండర్డ్ ఉపయోగపడనుండగా.. పదో తరగతి తర్వాత మ్యాథ్స్ వద్దనుకునే వాళ్లు బేసిక్ లెవల్‌కు వెళ్లొచ్చు. రెండు లెవల్స్‌లో దేనిని ఎంపిక చేసుకోవాలో సంబంధిత స్కూల్ లిస్ట్ ఆఫ్ క్యాండిడేట్స్‌ను సబ్‌మిట్ చేసే సమయంలో విద్యార్థి చెపాల్సి ఉంటుంది అని బోర్డు చెప్పింది. ఒకవేళ ఎవరైనా మ్యాథ్స్‌లో ఫెయిలైతే కనుక.. బేసిక్ ఎంచుకున్న విద్యార్థి అందులోనే కంపార్ట్‌మెంటల్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. స్టాండర్డ్ ఎంచుకున్న విద్యార్థి స్టాండర్డ్ లేదా బేసిక్‌లో ఎగ్జామ్ రాయొచ్చు. ఒకవేళ బేసిక్‌లో పాసైన విద్యార్థి స్టాండర్డ్ ఎగ్జామ్ రాయాలని అనుకుంటే.. కంపార్ట్‌మెంల్ టైమ్‌లో రాసుకునే వీలు కూడా ఉంటుంది.

ఆ ఉద్యోగాల్లో మహిళలొద్దు

- రైల్వే శాఖ సంచలన నిర్ణయం
- డ్రైవర్లు, పోర్టులు, గార్డులు, ట్రాక్‌మెన్..
- ఈ ఉద్యోగాలన్నీ పురుషులకే ఇవ్వాలి
- పర్సనల్ విభాగానికి ఉన్నతాధికారుల లేఖ



న్యూఢిల్లీ, జనవరి 11: కఠినమైన, అనుకూల పని వాతావరణం లేని కొన్ని ఉద్యోగాల్లో మహిళలను తీసుకోకపోవడమే మంచిదని భారత రైల్వేశాఖ భావిస్తోంది. డ్రైవర్లు, పోర్టర్లు, గార్డులు, ట్రాక్‌మెన్ లాంటి పోస్టుల్లో కేవలం పరుషులనే తీసుకునేలా అనుమతి ఇవ్వాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రయినింగ్ విభాగానికి లేఖ రాసింది. ఇటువంటి ఉద్యోగాల్లో మహిళలకు సరైన భద్రత లేకపోవడమేగాక, కఠినమైన పనులు ఉండటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వేశాఖ చెబుతోంది. రైల్వే శాఖలో 13లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మహిళల సంఖ్య 2 నుంచి 3 శాతం మాత్రమే. వీరిలో చాలా మంది డెస్కుల్లో, కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తుండగా.. డ్రైవర్, గార్డులు, పోర్టర్లు, ట్రాక్‌మెన్ల పోస్టుల్లోనూ కొందరు మహిళలు ఉన్నారు. అయితే మహిళల పట్ల తమకు ఎలాంటి వివక్ష లేదని, కానీ కొన్ని పోస్టుల్లో విధుల సమయంలో వీరికి సరైన భద్రత ఉండట్లేదని, పని వాతావరణం కూడా సానుకూలంగా లేదని రైల్వేశాఖ అభిప్రాయపడుతోంది. అందుకే ఇలాంటి పోస్టుల్లో పురుషులను మాత్రమే తీసుకోవాలని యోచిస్తోంది.

డ్రైవర్‌లు సాధారణంగా ఒక రైళ్లో ఇద్దరు మాత్రమే ఉంటారు. ఇక గార్డులు సిగ్నళ్లు ఇచ్చేందుకు రైలు చివరి బోగిలో ఉంటారు. పోర్టర్లు రైల్వే స్టేషన్లలో బరువైన లగేజీలను ఎత్తాల్సి ఉంటుంది. రైల్వే ట్రాక్‌లను పరిశీలించేందుకు ట్రాక్‌మెన్‌లను నియమిస్తారు. అయితే దీనిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రయినింగ్ విభాగం ఇంతవరకూ స్పందించలేదు. కాగా.. రైల్వే ఉద్యోగుల యూనియన్ మాత్రం దీన్ని తప్పుబడుతోంది. 'రైల్వేల్లో మహిళలకు సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవు. అందుకే మహిళలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు రైల్వేశాఖ సుముఖంగా లేదు. మహిళలను తీసుకోకుండా ఉండే బదులు.. వారికి సదుపాయాలను మెరుగుపరిస్తే బాగుంటుంది' అని ఉద్యోగ యూనియన్ సభ్యులు చెబుతున్నారు.

పిచ్, వాతావరణం

చివరి టెస్టు సమయంలో రెండ్రోజులు వర్షం కురిసిన తర్వాత సిడ్నీలో శనివారం వాతావరణం వెచ్చగా ఉండనుంది. ఈ సీజన్‌లో ఫ్లాట్‌గా కనిపించిన సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ)లో పరుగుల వరద పారనుంది.

అనుచిత వ్యాఖ్యలను సమర్థించం

- పాండ్య, రాహుల్‌లపై కోహ్లీ

సిడ్నీ: హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ల చుట్టూ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో వాళ్లు చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పందించాడు. వారి పట్ల జట్టు నిర్ణయాన్ని కూడా ప్రకటించాడు. పాండ్య, రాహుల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వారి వ్యక్తిగతమైనవని, వాళ్లపై తీసుకునే నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని కోహ్లీ చెప్పాడు. 'భారత క్రికెట్ జట్టుగా, బాధ్యతాయుత క్రికెటర్లుగా మేము అటువంటి వాటిని సమర్థించం. అవి పూర్తిగా వారి వ్యక్తిగత అభిప్రాయాలు. వాళ్లపై తీసుకోబోయే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం. భారత క్రికెట్ జట్టు దృష్టికోణంలో చూస్తే.. ఆ వ్యాఖ్యలు మా డ్రెస్సింగ్ రూమ్‌లో ఎటువంటి మార్పులూ తీసుకురాలేవు. మాలో ఉన్న స్ఫూర్తిని ఏమాత్రం దెబ్బతీయలేవు' అని కోహ్లీ అన్నాడు.

రిటైర్మెంట్ తర్వాత మళ్లీ బ్యాట్ ముట్టను


- టీమిండియా కెప్టెన్ కోహ్లీ

సిడ్నీ: రిటైర్మెంట్ తీసుకున్న క్రికెటర్లు ప్రస్తుతం ప్రపంచంలో జరిగే టీ20 లీగ్స్ ఆడుతున్నారు. కానీ తాను రిటైర్ అయితే మళ్లీ బ్యాట్ ముట్టనని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. రిటైర్ అయిన తర్వాత లేదా భారత క్రికెటర్లపై బీసీసీఐ ఆంక్షలు ఎత్తేసిన తర్వాత ఆస్ట్రేలియాకు చెందిన బిగ్ బాష్ లీగ్‌లో ఆడతావా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. రిటైర్మెంట్ తర్వాత ఎటువంటి లీగ్స్‌లోనూ ఆడనని కోహ్లీ చెప్పాడు. 'చూడండి.. భవిష్యత్తులో బీసీసీఐ తన నిర్ణయం మార్చుకోవచ్చు. నాకు సంబంధించినంత వరకు ఒకసారి కెరీర్ ముగిసిందంటే అంతే. నిజం చెప్పాలంటే నేను మాత్రం మళ్లీ బ్యాట్ పట్టుకునే వాళ్ల జాబితాలో ఉండను' ఆస్ట్రేలియాతో శనివారం తొలి వన్డే సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోహ్లీ అన్నాడు. ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెక్‌కల్లమ్ వంటి రిటైర్డ్ క్రికెటర్లు ఐపీఎల్, బిగ్‌బాష్ వంటి టీ20 లీగ్స్‌లో ఆడుతున్నారు.

నాకిది చివరి టోర్నీ

- ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత రిటైరవుతానన్న ముర్రే

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ తనకు చివరి టోర్నీ అని ఇంగ్లాండ్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే గురువారం ప్రకటించాడు. వింబుల్డన్ తర్వాత గుడ్‌బై



చెబుదామనుకున్న ముర్రే మెల్‌బోర్న్ తర్వాత ఇక ఆడలేనని నిర్ణయించుకున్నాడు. రిటైర్మెంట్ ప్రకటించేటప్పుడు ముర్రే కన్నీరుమున్నీరయ్యాడు. తుంటి ఎముక గాయం కారణంగా తన కెరీర్ ముగింపు వచ్చిందని చెప్పాడు. చివరిసారిగా వింబుల్డన్ ఆడాలనుకున్నట్టు 31 ఏళ్ల ముర్రే తెలిపాడు. కానీ ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత ఆడగలనో లేదో అన్న అనుమానంతో అతను ముందుగానే రిటైర్మెంట్ ప్రకటించాడు.



ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన ఇప్పుడు వన్డే సిరీస్ టైటిల్‌పై దృష్టి పెట్టింది. ఈ సిరీస్‌ను ఈ ఏడాది జరిగే వరల్డ్ కప్‌కు సన్నాహకంగా భావిస్తోంది. ప్రస్తుత జట్టులోని 13 మంది క్రికెటర్లు ఈ సిరీస్‌పై ఉత్సాహంగా ఉన్నారు. ఎందుకంటే ఎవరు వరల్డ్ కప్ జట్టులో ఆడతారన్నది ఈ సిరీస్ నిర్ణయిస్తుంది. ఉన్నట్టుండి హైదరాబాద్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు పిలుపు రావడంతో అతను కూడా వరల్డ్ కప్ జట్టులో చోటు కోసం చెమటోడ్చనున్నాడు. అయితే మరో కపిల్‌దేవ్ అవుతాడని పేరు తెచ్చుకున్న ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య మహిళల పట్ల చులకనగా మాట్లాడటం బాధాకరం. కానీ అతనిపై సస్పెన్షన్ వేటు జట్టుపై ఎటువంటి ప్రభావం చూపదని కెప్టెన్ కోహ్లీ అన్నాడు. ఏదిఏమైనా ఈ సిరీస్‌ను కూడా టీమిండియా గెలిచి ఉత్సాహంతో వరల్డ్ కప్ బరిలోకి దిగాలని ఆశిద్దాం...

వరల్డ్ కప్‌కు... ఫైనల్ ప్రాక్టీస్

నేడు ఇండియా, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే



- మూడు మ్యాచ్‌ల సిరీస్
- ఉదయం 7:50 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

సిడ్నీ: టెస్టు సిరీస్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన ఈ నూతన సంవత్సరంలో తొలి వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. ఆస్ట్రేలియాతో జరగనున్న ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఈ ఏడాది జరగనున్న వరల్డ్ కప్‌కు చివరి సన్నాహకంగా టీమిండియా భావిస్తోంది. కానీ ఊహించని టీవీ షో వివాదం కోహ్లీ సేన ఏకాగ్రతను కాస్త దెబ్బతీసినట్టయింది. శనివారమిక్కడ ఇండియా, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరగనుంది. ఓ టీవీ షోలో భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ మహిళల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలు పెద్ద దుమారమే లేపాయి. అయితే తొలి మ్యాచ్‌కు తుది జట్టు ఎంపికకు ఆ ఇద్దరు క్రికెటర్లపై తీసుకోనున్న నిర్ణయం కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఎదురుచూస్తోందని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. మామూలుగా అయితే ఒక రోజు ముందే తుది జట్టును టీమిండియా ప్రకటిస్తుంది. కానీ కళంకిత క్రికెటర్లపై సీఓఏ, బీసీసీఐ స్పష్టమైన నిర్ణయాలు ఇంకా వెలువడక పోవడంతో ఈ మ్యాచ్‌కు తుది జట్టును ప్రకటించలేదు. దీంతో ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే తొలి వన్డేకు పాండ్య, రాహుల్ అందుబాటులో ఉంటారు. అయినప్పటికీ తొలి వన్డేకు రాహుల్‌ను పక్కన పెట్టే అవకాశముంది. ఎందుకంటే అతను టెస్టు, వన్డే రెండు ఫార్మాట్లలోనూ పేలవ ప్రదర్శన కనబరుస్తున్నాడు. దీంతో ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. అయితే పాండ్య ఈ మ్యాచ్‌లో ఆడతాడా? లేదా అనేదానిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. జట్టులో ఆల్ రౌండర్ ఉండటం చాలా అవసరం. అతను 10 ఓవర్లు బౌలింగ్ చేయడంతో పాటు మిడిలార్డర్‌లో బ్యాటింగ్ కూడా చేయగలడు. ఒకవేళ పాండ్య ఈ మ్యాచ్‌కు దూరమైతే టీమిండియా తన బౌలింగ్ అటాక్‌లో మార్పులు చేసుకుంటుంది. ఎందుకంటే జస్‌ప్రీత్ బుమ్రాకు ఇప్పటికే ఈ సిరీస్‌కు, న్యూజిలాండ్‌తో సిరీస్‌కు విశ్రాంతినిచ్చారు. దీంతో చివరిసారిగా ఓ ప్రయోగం చేయాల్సి ఉంటుంది.

భువనేశ్వర్ కుమార్‌కు తుది జట్టులో చోటు దక్కుతుంది. అయితే ఒకవేళ కోహ్లీ ముగ్గురు పేస్ బౌలర్లతో బరిలోకి దిగాలనుకుంటే పాండ్య స్థానంలో ఎవరు ఆడతారో చూడాలి. ఇటువంటి సమయంలో మహ్మద్ షమీ లేదా ఖలీల్ అహ్మద్‌లలో ఎవరికో ఒకరికి చోటు దక్కే అవకాశముంది. పచ్చ గడ్డితో ఉన్న సిడ్నీ పిచ్‌ను చూస్తుంటే టీమిండియా కెప్టెన్ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్ల కాంబినేషన్‌వైపు మొగ్గు చూపుతాడనిపిస్తోంది. ఒకవేళ తొలి వన్డేలో పాండ్య ఆడకపోతే ఆల్ రౌండర్ స్థానాన్ని రవీంద్ర జడేజా భర్తీ చేస్తాడని కోహ్లీ అన్నాడు. ఐదుగురు బౌలర్లతో బరిలోకి దిగాల్సి వస్తే జడేజాకు తోడుగా కుల్‌దీప్ యాదవ్ ఉంటాడని.. అవసరమైతే కేదార్ జాదవ్ పార్ట్ టైమ్ బౌలర్ బాధ్యతలు నిర్వర్తిస్తాడని కూడా కోహ్లీ చెప్పాడు. ఇద్దరు ఓపెనర్లతో పాటు కోహ్లీ మూడో నంబర్ స్థానంలో బరిలోకి దిగనున్నాడు. జాదవ్, ఎంఎస్ ధోనీ, అంబటి రాయుడు మిడిలార్డర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

2018లో ధోనీ అంతంత మాత్రంగానే ఆడాడు. 20 వన్డేల్లో 25 సగటుతో 275 పరుగులు చేశాడు. మిడిలార్డర్‌లో బరిలోకి దిగనున్న ధోనీ ఈ నూతన సంవత్సరంలో శుభారంభం చేయాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. రాయుడుకు ఎంతో కీలకమైన నాల్గో నంబర్ స్థానంలో బాధ్యతలు మరోసారి అప్పగించనుంది. గత సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్‌లో తాత్కాలికంగా రాయుడును మిడిలార్డర్‌లో దింపింది. ఆ టోర్నీలో 11 వన్డేలు ఆడిన రాయుడు 392 పరుగులు చేయడంతో పాటు వెస్టిండీస్‌పై 56 సగటు నమోదు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలున్నాయి.

1985 వరల్డ్ చాంపియన్‌షిప్, 2008 సీబీ సిరీస్ విజయాలు కాకుండా ఆస్ట్రేలియాలో టీమిండియాకు పేలవ రికార్డు ఉంది. ఆస్ట్రేలియాలో కంగారూలతో ఆడిన 48 వన్డేలకుగాను 35 మ్యాచ్‌ల్లో మాత్రమే టీమిండియా గెలిచింది. ఆస్ట్రేలియా జట్టులో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్ లేకపోవడం టీమిండియాకు మరోసారి కలిసిరానుంది. తొలి వన్డేకు ఆస్ట్రేలియా తుది జట్టును ప్రకటించింది. జట్టులో ఏకైక స్పిన్నర్‌గా నాథన్ లియాన్ ఉన్నాడు. 2010 తర్వాత తొలిసారి పీటర్ సిడ్డిల్‌కు జట్టులో చోటు దక్కింది. తొలిసారి వికెట్‌కీపర్/బ్యాట్స్‌మన్ అలెక్స్ క్యారే తొలి వన్డేలో ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. కెప్టెన్ ఆరోన్ ఫించ్‌తో కలిసి బరిలోకి దిగనున్నాడు. ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హాండ్స్‌కంబ్ మిడిలార్డర్



బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆరు, ఏడు స్థానాల్లో మార్కస్ స్టొయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్ బరిలోకి దిగనున్నారు. అయితే ఆస్ట్రేలియా పేస్ అటాక్ పేపరుపై బలహీనంగా కనిపిస్తోంది. ఎందుకంటే ఎనిమిదేళ్ల తర్వాత సిడ్డిల్ ఆస్ట్రేలియా జట్టుకు ఆడనున్నాడు. మరోవైపు ఎడమ చేతి పేసర్ జాసన్ బెహ్రాన్‌డార్ఫ్ శనివారం వన్డేల్లో అరంగేట్రం చేయనున్నాడు.

ఇండియా: విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్.

ఆస్ట్రేలియా తుది జట్టు: ఆరోన్ ఫించ్, అలెక్స్ క్యారే (వికెట్ కీపర్), ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హాండ్స్‌కంబ్, మార్కస్ స్టొనిస్, గ్లెన్ మాక్స్‌వెల్, నాథన్ లియాన్, పీటర్ సిడ్డిల్, జై రిచర్డ్సన్, జాసన్ బెహ్రెన్‌డార్ఫ్.

ఇండియా – ఆస్ట్రేలియా (చివరి ఐదు వన్డేల్లో)

ఇండియా:	గె	గె	ఓ	టై	గె
ఆస్ట్రేలియా:	ఓ	గె	ఓ	ఓ	ఓ

ఎస్‌సీజీలో గణాంకాలు


- ఎస్‌సీజీలో ఇండియా, ఆస్ట్రేలియా జట్లు 16 వన్డేలు ఆడాయి. ఆస్ట్రేలియా 13, ఇండియా రెండు మ్యాచ్‌ల్లో గెలిచాయి. టీమిండియా చివరిసారిగా 2016లో మ్యాచ్ గెలిచింది. మరో రెండు బంతులు మిగిలివుండగా 331 పరుగుల లక్ష్యాన్ని సాధించింది. ఆస్ట్రేలియా జట్టులో డేవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్ సెంచరీలు చేయగా.. టీమిండియాలో మనీష్ పాండే 81 బంతుల్లో 104 పరుగులు సాధించాడు.
- ధావన్ మరో 65 పరుగులు చేస్తే వన్డేల్లో 5000 పరుగులు పూర్తి చేస్తాడు. జడేజా 18 పరుగులు చేస్తే 2000 పరుగులు పూర్తవుతాయి. భువనేశ్వర్ 100 వికెట్ల క్లబ్‌లో చేరేందుకు 1 వికెట్ దూరంలో ఉన్నాడు.
- క్యారే తొలిసారి వన్డేల్లో ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.



విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగింపు

- సీఓఏ చీఫ్ వినోద్ రాయ్
- తాజా షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం
- తొలి వన్డే పాండ్య, రాహుల్ దూరం





న్యూఢిల్లీ: టీవీ షోలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌పై విచారణ పెండింగ్‌లో ఉన్నందున ఇద్దరిపై సస్పెన్షన్ కొనసాగిస్తున్నట్టు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ చీఫ్ వినోద్ రాయ్ అన్నారు. దీంతో ఆస్ట్రేలియా మూడో మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరగనున్న తొలి వన్డేకు వీరిద్దరూ దూరమయ్యారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' అనే టీవీ ప్రోగ్రాంలో మహిళలపై వీరిద్దరూ వ్యామోహంతో కూడిన వ్యాఖ్యలు చేయడంతో అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దీంతో తొలి వన్డే తుది జట్టు నుంచి వీరిద్దరినీ తొలగించారు. 'కేసు విచారణలో ఉన్నందున పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్ కొనసాగుతుంది' అని వినోద్ రాయ్ అన్నారు. అయితే విచారణ మొదలయ్యే ముందు మరోసారి వీరిద్దరికీ తాజాగా షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. 'బీసీసీఐ అంతర్గత కమిటీ లేదా అడ్ హక్ అంబుడ్స్‌మన్ విచారణ పరుపుతారా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. వాళ్లను జట్టులోనే కొనసాగిస్తాలా? లేక స్వదేశం పంపాలా? అన్న దానిపై టీమిండియా మేనేజ్‌మెంట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జట్టులోనే కొనసాగించాలనే ఆలోచనలు కూడా ఉన్నాయి. కానీ బీసీసీఐలోని చాలా మంది పెద్దలు ఈ ఆలోచనలను వ్యతిరేకిస్తున్నారు' అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. ఒకవేళ వాళ్లిద్దరినీ స్వదేశంకు పంపినట్టయితే వారి స్థానంలో రిషబ్ పంత్, మనీష్ పాండే జట్టులో చేరతారు. 'విజయ్ శంకర్, శ్రేయాస్ అయ్యర్, మనీష్ పాండే లేదా రిషబ్ పంత్‌లలో ఏ ఇద్దరిని పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని కూడా ఆ అధికారి చెప్పారు. రాయ్ సీఓఏ సహచరురాలు డయానా ఎడుల్జీ నిర్ణయం ప్రకారం తదుపరి చర్యలు తీసుకునేందుకు పాండ్య, రాహుల్‌పై సస్పెన్షన్ కొనసాగించారు. వీళ్ల వ్యాఖ్యలు ప్రవర్తన నిబంధనావళిని ఉల్లంఘించడమేనని ప్రకటించేందుకు బీసీసీఐ లీగల్ కమిటీ తిరస్కరించడంతో సస్పెన్షన్ కొనసాగింపు నిర్ణయం తీసుకున్నారు.

తొలుత ఎడుల్జీ రెండు మ్యాచ్‌ల నిషేధంను సూచించారు. కానీ తర్వాత ఈ కేసులు లీగ్ సెల్‌కు అప్పగించారు. ఎడుల్జీ నిర్ణయాన్ని రాయ్ సమర్థించారు.

క్రికెటర్ల ప్రతిష్ఠను దిగజార్చారు

- పాండ్య, రాహుల్‌పై భజ్జీ ఆగ్రహం

ముంబై: ఓ టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై ప్రముఖ స్పిన్నర్ హర్భజన్ సింగ్ శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. క్రికెటర్ల ప్రతిష్ఠను దిగజార్చారని భజ్జీ అన్నాడు. ఆ షోలో ఇద్దరు క్రికెటర్లు మాట్లాడారు. అయితే ముఖ్యంగా పాండ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలు వచ్చాయి. భారత క్రికెట్ జట్టు సంస్కృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో చర్యల కింద పాండ్య, రాహుల్‌లపై కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) ఇద్దరినీ సస్పెండ్ చేసింది. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ఆ వ్యాఖ్యలను ఖండించాడు. 'ఇటువంటి విషయాలను కనీసం స్నేహితులతో కూడా మాట్లాడం. అటువంటిది వాళ్లు బహిరంగంగా టీవీ షోలో మాట్లాడారు. దీంతో హర్భజన్ ఇలాంటి వాడు.. అనిల్ కుంబ్లే అలాంటి వాడు.. సచిన్ టెండూల్కర్ మరోలాంటి వాడు అని ప్రజలు భావిస్తుండొచ్చు' అని హర్భజన్ అన్నాడు. ఆ షోలో అనేక మంది మహిళలతో తాను గడిపిన విషయాలను తెలిపాడు. అంతేకాకుండా ఆ విషయాలను తల్లిదండ్రులతో పంచుకుంటానని చెప్పాడు. అయితే సంబంధాలపై, మహిళలపై రాహుల్ కాస్త తక్కువగానే స్పందించాడు.

కోహ్లీ, శాస్త్రీలకు ఎస్‌సీజీ గౌరవ సభ్యత్వం

సిడ్నీ: ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా రికార్డు సృష్టించిన టీమిండియాక సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌తో (ఎస్‌సీజీ) ప్రత్యేక అనుబంధం ఏర్పడినట్టు కనిపిస్తోంది. ఇండియా, ఆస్ట్రేలియా మధ్య శనివారమిక్కడ తొలి వన్డే జరగనున్న నేపథ్యంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రికి ఎస్‌సీజీ గౌరవ జీవితకాల సభ్యత్వాన్ని ఇచ్చింది. దీంతో



ఈ బంధం మరింత దృఢంగా మారింది. ఈ వేదికలో టీమిండియా కెప్టెన్‌కు, కోచ్‌కు తీపి జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా కోచ్ రవిశాస్త్రి 1992లో డబుల్ సెంచరీ చేసింది ఇక్కడే. దీంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నారు. ఇంతకుముందు టీమిండియా ఇక్కడికి వచ్చినప్పుడు కెప్టెన్ కోహ్లీ సెంచరీ సాధించాడు. నిర్ణీత ఓవర్ల ఫార్మాట్‌లోనూ రెండు అర్ధ సెంచరీలు చేశాడు. ఆసక్తికరమైన అంశమేంటంటే.. కోహ్లీ ఈ మైదానంలో నాలుగు వన్డేలు ఆడాడు. అతని అత్యధికం 21. అయితే ఈసారి ఆ అత్యధిక స్కోరు మార్చాలని కోహ్లీ భావిస్తున్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com